విశాఖపట్టణం
శనివారం 10 అక్టోబర్ 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 239 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

# కేబినెట్ ప్రత్యేక భేటీ

సుప్రీంకోర్టు తీర్పుపై చర్చ

రాజీవ్ రంజన్ మిశ్రా నివేదికపై చర్చ

2




# పార్టీ పరంగా 34 శాతం రిజర్వేషన్లు అమలు



## 34 శాతం రిజర్వేషన్లు కుదరవు

50 శాతం పరిమితానికి లోబడాల్సిందే

హైకోర్టు సహేతుకమైన ఉత్తర్వులు ఇచ్చింది

ఈ వ్యవహారంలో మేం జోక్యం చేసుకోలేం

రాష్ట్ర ప్రభుత్వం రెండు జీఓలు కొట్టివేత

బీసీల రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు స్పష్టీకరణ

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అంశంపై ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన తీర్పును అత్యున్నత న్యాయస్థానం సమర్థించింది. స్థానిక పోరులో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన రెండు జీవోలను రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షీల్ నాగులతో కూడిన సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఈ కేసు విచారణ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేసింది. ఏపీ హైకోర్టు అత్యంత సహేతుకమైన ఉత్తర్వులను వెలువరించిందని.... అందులో తాము జోక్యం చేసుకోవాల్సిన అవసరం ..మిగతా 2లో

కోర్టు కాదన్నా చిత్తశుద్ధితో అమలు చేస్తాం

మీ భూమికి మీరే యజమానులు

40.5 లక్షల మందికి పాస్ పుస్తకాలు ఇచ్చాం

రాబోయే రోజుల్లో మరో 51 లక్షల మందికి ఇస్తాం

రైతులు ప్రభుత్వం చుట్టూ తిరిగే పరిస్థితి రానివ్వం

సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు



(ప్రకాశం - జయజయహే)

ప్రతి రైతుకూ పూర్తి పారదర్శకతతో భూ హక్కులు కల్పిస్తూ పట్టాదార్ పాస్‌పుస్తకాలను అందిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 40.5 లక్షల పట్టాదార్ పాస్‌పుస్తకాలను అధికారిక ముద్రతో పంపిణీ చేశామని, రాబోయే రోజుల్లో నెలకు తగిన లక్ష్యాలను నిర్దేశించుకుని మరో 51 లక్షల పాస్‌పుస్తకాలను అందజేస్తామని ప్రకటించారు. ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గంలోని నర్సింగోలు గ్రామంలో శుక్రవారం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అక్టోబర్ నెలలోనే 790 గ్రామాల్లో దాదాపు నాలుగు లక్షలకు పైగా పాస్‌పుస్తకాలను పంపిణీ చేసినట్లు ..మిగతా 2లో

# బీసీలకు బాబు దగా

34శాతం రిజర్వేషన్ల పేరుతో మోసం

చట్ట సవరణ చేయాలని చంద్రబాబుకు తెలియదా..?

డబుల్ ఇంజిన్ సర్కారులో రాజ్యాంగ సవరణ చేయాలి

మోదీతో భేటీల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై చర్చించలేదేం..?

వెనుక వడిన వర్గాలకు పెద్దపీట వేసింది జగన్ మాత్రమే

కావాలంటే లెక్కలు తీయండి.. బహిరంగ చర్చకు సిద్ధం

శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ స్పష్టీకరణ



(విజయనగరం - జయజయహే)

రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలకు న్యాయం చేస్తామని 34 శాతం రిజర్వేషన్ల పేరుతో హామీ ఇచ్చి ఇప్పుడు వారిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోసారి మోసానికి గురి చేసారని శాసన మండలి విపక్ష నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ధ్వజమెత్తారు. బీసీలకు నిజంగా న్యాయం చేయాలనే చిత్తశుద్ధి ఉంటే, డబుల్ ఇంజిన్ సర్కారుగా చెప్పుకునే కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి రాజ్యాంగ సవరణ చేయించాలని ఆయన చంద్రబాబుకు సవాల్ ..మిగతా 2లో

## గెజిట్ వెలువరిస్తేనే నోటిఫికేషన్

రిజర్వేషన్లు ఖరారైతే పార్టీలతో సమావేశం

ఎస్ ఈసీ అనిల్ చంద్ర పునేఠా వెల్లడి

(అమరావతి - జయజయహే)



స్థానిక సంస్థల ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి అనిల్ చంద్ర పునేఠా కీలక ప్రకటన చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇస్తే, ఆ తర్వాత ఎలక్షన్ నోటిఫికేషన్ విడుదల చేస్తామని స్పష్టం చేశారు. శుక్రవారం మీడియాతో ఆయన చిట్‌చాట్ చేశారు. రిజర్వేషన్లు ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉందని తెలిపారు. 'సర్' ప్రక్రియ తర్వాత చేపట్టిన ఓటర్ల ..మిగతా 2లో



## అర్ధరాత్రి రైల్లో ఏం జరిగింది..!?

అస్సాం యువతి హిమశ్రీ మృతిపై మిస్టరీ

శ్రీకాకుళంలోని బొడ్డేపల్లి వద్ద పట్టాలపై మృతదేహం

హత్య చేసి చంపారా.. జారి పడి మృతి చెందిందా..?

స్పందించిన అస్సోం సీఎం, కేంద్ర మంత్రులు

సీఎం చంద్రబాబుకు లేఖలు

ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు

(విశాఖపట్నం - జయజయహే)

ఓ నృత్య ప్రదర్శన కోసం అసోం నుంచి రాష్ట్రానికి వచ్చిన యువతి రైలు పట్టాల వద్ద శవమై తేలింది. అర్ధరాత్రి రైలులో ప్రయాణిస్తున్న సమయంలో 'నా చుట్టూ చాలా మంది మగవాళ్లు ఉన్నారు. కొందరు మద్యం తాగుతున్నారు, భయంగా ఉంది' అని యువతి కుటుంబ సభ్యులతో ఫోన్‌లో ..మిగతా 2లో

# ఢిల్లీ అష్టదిగ్బంధనం

ఇప్పటికే పలు రైళ్లు రద్దు.. అర్ధరాత్రి నుంచి ఇంటర్నెట్ కట్

కాక్ రోచ్ నిరసనల వేళ కేంద్రం చర్యలు

సీఈసీ జ్ఞానేశ్ రాజీనామా కోసం 10న ధర్నాకు పిలుపు

57 మెట్రో స్టేషన్ల మూసివేత




(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 10 నుంచి కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ధర్నాకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నిరసనకు ఢిల్లీ పోలీసులు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. అయినప్పటికీ, నిరసనకు దిగేందుకు సీజేపీ సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ ..మిగతా 2లో



## ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై పవన్ ఆగ్రహం

అవినీతి, అక్రమాలు, వసూళ్లపై విచారణ

హైలెవల్ కమిటీని నియమిస్తూ ప్రకటన

గతంలో పలుమార్లు హెచ్చరించిన జనసేనాని

మార్పు రాకపోవడంతో చర్యలకు సిద్ధం

2

## మృతదేహాన్ని దుప్పట్లో చుట్టి దహనం

పోలీసుల చిత్రహింసలే మృతికి కారణం

కస్టోడియల్ డెత్‌కు ఏడుగురు పోలీసుల బాధ్యులు

సాయికృష్ణ కస్టోడియల్ డెత్‌పై

కోర్టుకు సిట్ రిపోర్టు

3



## కేంద్ర బలగాలను దించాలి

రాష్ట్ర పోలీసులపై నమ్మకం లేదు

అభ్యర్థులకు, ఓటర్లకు రక్షణ కల్పించాలి

లైవ్ వెబ్ కాస్టింగ్ నిర్వహించాలి

టీడీపీ ఏజెంట్ల నుంచి మా నేతలకు ముప్పు

కేంద్రానికి వైఎస్సార్ సీపీ లేఖ

2

# ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై పవన్ ఆగ్రహం

**అవినీతి, అక్రమాలు, వసూళ్లపై విచారణ**

**హైలెవల్ కమిటీని నియమిస్తూ ప్రకటన**

**గతంలో పలుమార్లు హెచ్చరించిన జనసేనాని**

**మార్పు రాకపోవడంతో చర్యలకు సిద్ధం**

**(మంగళగిరి - జయజయహే)**



పోలవరం జనసేన ఎమ్మెల్యే చిర్రి బాలరాజుపై వస్తున్న అవినీతి, వ్యక్తిగత ఆరోపణలపై ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సీరియస్ అయ్యారు. మీడియాలో, సోషల్ మీడియా వేదికల్లో ఆయనపై వస్తున్న వరుస కథనాలపై సమగ్ర విచారణ జరిపేందుకు పార్టీ కేంద్ర కార్యాలయం తరఫున ఒక హైలెవల్ కమిటీని నియమిస్తూ అధికారిక ప్రకటన విడుదల చేశారు. గతంలో స్వయంగా మంగళగిరికి పిలిపించి పద్ధతి మార్చుకోవాలని, నీతివంతమైన పాలన అందించాలని హెచ్చరించినప్పటికీ ఎమ్మెల్యే తీరులో మార్పు రాకపోవడంతో పవన్ కల్యాణ్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ విచారణ కమిటీ నియామకం వెనుక నియోజకవర్గంలో చోటుచేసుకున్న పరిణామాలు ఉన్నాయి. కొయ్యలగూడెం పరిసరాల్లో మట్టి, ఇసుక తవ్వకాల వాటాల పంపకాలకు సంబంధించి ఒక మహిళతో, స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే స్వయంగా లక్షల రూపాయల క్యాష్ సెటిల్‌మెంట్లు చేస్తున్న ఆడియో, వీడియో క్లిప్పింగులు బయటకు వచ్చి నెట్టింట వైరల్ అయ్యాయి. కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తుంటే, స్వయంగా ఎమ్మెల్యేనే దందాల్లో భాగస్వామి కావడం పార్టీ అధిష్ఠానానికి మింగుడుపడలేదు.

**ఎమ్మెల్యే భార్య పెత్తనం**

దీనికి తోడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే భార్య ఒక పార్టీ నాయకుడిపై దాడి చేయించారన్న ఆరోపణలు రావడం, సీనియర్ నేతలను, జనసైనికులను పక్కనపెట్టి పెత్తనం చెలాయిస్తున్నారని ఫిర్యాదులు వెల్లువెత్తడంతో పవన్ తీవ్ర అసహనానికి గురయ్యారు. అడవితల్లి బాట పేరిట పవన్ కల్యాణ్ గిరిజన ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తుంటే, అదే గిరిజన ప్రాంతం నుంచి గెలిచిన ఎమ్మెల్యేపై ఇలాంటి ఆరోపణలు రావడం పవన్‌ను ఆగ్రహానికి గురిచేసింది. తాజాగా నియమించిన హైలెవల్ కమిటీ నియోజకవర్గంలో క్షేత్రస్థాయి విచారణ జరిపి నివేదిక సమర్పించిన తర్వాత చర్యలు తీసుకోనున్నారు.

# బీసీలకు బాబు దగా

మొదటి పేజీ తరువాయి...

చేసారు. అంతేకానీ కోర్టుల్లో నిలబడవని తెలిసి కూడా మభ్య పెట్టేలా నిర్ణయాలు తీసుకుని బీసీ వర్గాలను దగా చేయడం సరికాదని స్పష్టం చేశారు. విజయనగరంలోలని జిల్లా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మీడియాతో బొత్స సత్యనారాయణ మాడుతూ, బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు నిర్ణయం న్యాయపరంగా నిలబడుతుందా లేదా అనే విషయాన్ని ముందుగానే ఆలోచించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై లేదా అని బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. రాష్ట్రంలో ఉన్న బీసీ సోదరులకు రాజ్యాంగపరమైన హక్కులు, చట్టపరమైన అంశాలు తెలియవని భావించి ప్రభుత్వం ఏది చెప్పినా నమ్ముతారని అనుకోవడం చంద్రబాబు రాజకీయ అహంకారానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేసారు. బీసీ వర్గాలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి, ఆ హామీని అమలు చేసే దిశగా స్పష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు మభ్య పెడితే మోసపోవడానికి బీసీలు సిద్ధంగా లేరని, చంద్రబాబు కుట్రలకు తగిన బుద్ధి చెబుతారని బొత్స హెచ్చరించారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పడం మాత్రమే సరిపోదని హితవు పలికారు. న్యాయపరమైన అడ్డంకులను అధిగమించి, రాజ్యాంగబద్ధమైన మార్గంలో రిజర్వేషన్లు అమలయ్యేలా చూడటం ప్రభుత్వ బాధ్యత అని బొత్స గుర్తు చేసారు. బీసీలకు ఇచ్చిన హామీలపై చంద్రబాబు నాయుడు ప్రజలకు సమాధానం చెప్పాలని, లేకుంటే బలహీన వర్గాలకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్ సీపీ పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేసారు.

**మోదీతో బీసీ రిజర్వేషన్లపై చర్చించలేదేం..?**

కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ డబుల్ ఇంజిన్ సర్కారు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిసి ముఖ్యమంత్రి రాష్ట్రంలోని బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగ సవరణ అవసరమని ఎందుకు కోరలేదు. బీసీలకు న్యాయం చేయడం కోసం కేంద్రంతో చర్చలు జరిపి, అవసరమైన రాజ్యాంగపరమైన మార్పులకు ప్రయత్నించారా..? చిత్తశుద్ధితో ఎటువంటి ప్రయత్నాలు చేయకుండా రాష్ట్రంలో ప్రకటనలు చేయడం, ఆ తర్వాత న్యాయపరమైన సమస్యలు ఎదురైనప్పుడు ప్రతిపక్షాలపై నిందలు వేయడం ఏమిటి..?

బీసీలకు ఇచ్చిన హామీల అమలుపై ముఖ్యమంత్రి ప్రజలకు సమాధానం చెప్పాలి. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి రిజర్వేషన్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. చంద్రబాబు నాయుడు బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి. ఇందుకు 34 శాతం రిజర్వేషన్లపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించి, అవసరమైన రాజ్యాంగ సవరణ కోసం కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలి. బీసీలను ఎన్నికల సమయంలో ఓట్ల కోసం ఉపయోగించుకుని, ఆ తర్వాత వారి సమస్యలను పట్టించుకోకపోవడం సరికాదు. బీసీ వర్గాలకు నిజమైన న్యాయం జరగాలంటే రాజకీయ ప్రకటనల కంటే చట్టబద్ధమైన చర్యలు ముఖ్యం. వైఎస్సార్‌సీపీ బీసీల హక్కుల కోసం నిరంతరం పోరాడుతుంది. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల్లో బీసీలకు అన్యాయం జరిగితే ప్రతిపక్షంగా ప్రశ్నిస్తాం.. నిలదీస్తాం.. పోరాడుతాం.. అని బొత్స స్పష్టం చేసారు.

**ఎవరేం చేసారో.. బహిరంగ చర్చకు సిద్ధమా..?**

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బీసీలకు రాజకీయంగా, సామాజికంగా ప్రాధాన్యత కల్పించాం. స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవులు సహా వివిధ రంగాల్లో బీసీలకు అవకాశాలు కల్పించేందుకు జగన్ హయాంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు చేపట్టింది. గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బీసీలకు ఎన్ని పదవులు ఇచ్చిందో, ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎంతమందికి అవకాశాలు కల్పించిందో బహిరంగంగా లెక్కలు వెల్లడించాలని సవాల్ చేస్తున్నా.. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానిక సంస్థల ప్రతినిధులు, నామినేటెడ్ పదవుల్లో బీసీలకు కల్పించిన అవకాశాలపై బహిరంగ చర్చకు మేం సిద్ధంగా ఉన్నాం. బీసీల సంక్షేమం గురించి మాటల్లో చెప్పడం కాకుండా, ఆచరణలో ఎవరెంత చేశారో గణాంకాలతో నిరూపణ చేయాలి. రిజర్వేషన్ల విషయంలో చట్టపరమైన పరిమితులు ఉన్నాయని తెలిసినప్పుడు, వాటిని అధిగమించేందుకు రాజ్యాంగబద్ధమైన పరిష్కారాలను అన్వేషించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. బీసీలకు ఎక్కువ అవకాశాలు కల్పించేందుకు మా పార్టీ ఎప్పుడూ వ్యతిరేకం కాదు అని బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు.

**స్థానిక ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ సిద్ధం**

స్థానిక సంస్థల ఎన్నికలను వైఎస్సార్‌సీపీ వాయిదా వేయాలని ఏనాడూ అనుకోలేదు. ఏ సమయంలో ఎన్నికలు నిర్వహించినా తమ పార్టీ పోటీకి సిద్ధంగా ఉంది. ప్రజల సమస్యలపై పోరాడటమే ప్రతిపక్ష పార్టీ బాధ్యత. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల్లో తప్పులు ఉంటే వాటిని ప్రశ్నించడం మా ప్రజాస్వామ్య హక్కు. వైఎస్సార్‌సీపీ ఎన్నికలకు భయపడి వెనక్కి తగ్గే పార్టీ కాదు. ఎన్నికలు నిర్వహించే ముందు ప్రభుత్వం చట్టపరమైన అంశాలను స్పష్టంగా పరిష్కరించాలి. ఒకవైపు రిజర్వేషన్లపై న్యాయపరమైన అభ్యంతరాలు ఉండగా, మరోవైపు ఎన్నికలకు సిద్ధమవుతున్నట్లు ప్రకటించడం ప్రజల్లో అనుమానాలను కల్పించే ఉద్దేశ్యం కాదా..? వైఎస్ జగన్ హయాంలో బీసీలకు అనేక పదవుల్లో పార్టీ పరంగా 50 శాతానికి మించి పదవులు అందించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారు. మా పార్టీ అధ్యక్షులు జగన్ గారు వరుసగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. అభ్యర్థులను కూడా ప్రకటిస్తున్నారు. చంద్రబాబు తరహాలో స్థానికలకు చేతులేత్తయేలేదు అని బొత్స ఎద్దేవా చేసారు

# కేబినెట్ ప్రత్యేక భేటీ

**(అమరావతి - జయజయహే)**

కేబినెట్ శనివారం ప్రత్యేకంగా సమావేశంకానుంది. రేపు ఉదయం 11 గంటలకు సచివాలయంలో కేబినెట్ భేటీ జరుగనుంది. బీసీ రిజర్వేషన్లపై జీవోలను సుప్రీంకోర్టు కొట్టివేయడంతో రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌పై చర్చించేందుకు కేబినెట్ సమావేశమవనుంది. కమిషన్ నివేదికను మంత్రివర్గం పరిగణలోకి తీసుకోనుంది. బీసీలకు రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సిఫార్స్ చేసిన రిజర్వేషన్లు, జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకొని వారికి రిజర్వేషన్లు ఇవ్వాలని కేబినెట్ నిర్ణయించనున్నట్లు సమాచారం. మంత్రివర్గం నిర్ణయానికి అనుగుణంగా వెంటనే జీవోలను ప్రభుత్వం విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. గతంలో బీసీ రిజర్వేషన్లపై విడుదల చేసిన జీవోలను ప్రభుత్వం ఉపసంహరించుకోనున్నట్లు సమాచారం. కేబినెట్ సమావేశానికి మంత్రులందరూ రావాలని సచివాలయం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి.

# కేంద్ర బలగాలను దించాలి

**రాష్ట్ర పోలీసులపై నమ్మకం లేదు**

**అభ్యర్థులకు, ఓటర్లకు రక్షణ కల్పించాలి**

**లైవ్ వెబ్ కాస్టింగ్ నిర్వహించాలి**

**టీడీపీ ఏజెంట్ల నుంచి మా నేతలకు ముప్పు**

**కేంద్రానికి వైఎస్సార్ సీపీ లేఖ**

**(తాడేపల్లి - జయజయహే)**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార యంత్రాంగం దుర్వినియోగానికి పాల్పడకుండా, అభ్యర్థులకు బెదిరింపులు ఎదురుకాకుండా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని (ఈసీ) కోరింది. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి శుక్రవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు మూడు వేర్వేరు లేఖలు రాశారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి ముగిసే వరకు అభ్యర్థులకు, ఓటర్లకు పూర్తి రక్షణ కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, ప్రతిపాదకులు, పోలింగ్ ఏజెంట్లకు టీడీపీ శ్రేణుల నుంచి ముప్పు పొంచి ఉందని లేళ్ల అప్పిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. నామినేషన్ కేంద్రాలు, సున్నితమైన పోలింగ్ స్టేషన్లు, స్ట్రాంగ్ రూమ్‌లు, లెక్కింపు కేంద్రాల వద్ద నిరంతరం సీసీటీవీ నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. వీలైన చోటల్లా ప్రత్యక్ష ప్రసారం (లైవ్ వెబ్‌కాస్టింగ్) నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. అభ్యర్థుల ఫిర్యాదుల స్వీకరణకు ప్రత్యేక హెల్ప్‌లైన్, స్వతంత్ర పరిశీలకులు, మొబైల్ నిఘా బృందాలను రంగంలోకి దించాలని పేర్కొన్నారు. మునిసిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నేరుగా జిల్లా కలెక్టరేట్లలో లేదా అధికారిక ఎన్నికల అధికారుల వద్ద నామినేషన్లు వేసే వెసులుబాటు కల్పించాలని అప్పిరెడ్డి కోరారు. "స్థానిక నామినేషన్ కేంద్రాల వద్ద దాడులు, అడ్డంకులు సృష్టించే ప్రమాదం ఉన్నందున జిల్లా కేంద్రాల్లో అదనపు నామినేషన్ సౌకర్యం కల్పించాలి. అక్కడి నుంచి పత్రాలను సంబంధిత రిటర్నింగ్ అధికారులకు సురక్షితంగా పంపేలా ఏర్పాట్లు చేయాలి. ప్రతి అభ్యర్థికి భయపడకుండా పోటీ చేసే హక్కును కాపాడాలి" అని ఆయన స్పష్టం చేశారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాకముందే కేంద్ర సాయుధ పోలీసు బలగాలను (సీఏపీఎఫ్) రాష్ట్రంలో మోహరించాలని అప్పిరెడ్డి విజ్ఞప్తి చేశారు. స్థానిక పోలీసుల నిష్పాక్షికతపై తమకు నమ్మకం లేదని, బలవంతపు ఉపసంహరణలు, నామినేషన్ల అడ్డుకట్టలను నివారించాలంటే కేంద్ర బలగాల పర్యవేక్షణే మార్గమని ఆయన లేఖలో వివరించారు.

# అర్ధరాత్రి రైల్లో ఏం జరిగింది..!?

మొదటి పేజీ తరువాయి...

మాట్లాడింది. యువతికి తల్లిదండ్రులు ధైర్యం చెప్పి, కొద్ది సేపటికి తిరిగి ఫోన్ చేయగా ఎటువంటి స్పందన లేదు. అంతలోనే ఉదయం రైలు పట్టాలపై యువతి శవమై కనిపించింది. అసలు ఆ రాత్రి ట్రైన్‌లో ఏం జరిగింది? ఆమెను ఎవరైనా వేధించారా? హత్య చేసి రైలు పైనుంచి తోసేశారా? లేదా జారి పడి మృతి చెందిందా? అనే కోణంలో పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు ఈ ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలని అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ.. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. స్వస్థలానికి వెళ్లేందుకు రైలెక్కిన అసోం యువతి శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస-పొందూరు రైల్వేస్టేషన్ల మధ్య బొడ్డేపల్లి పేట వద్ద శవమై కనిపించిన ఘటన కలకలం రేపింది. అసోం రాష్ట్రం గువాహటిలోని బోండా ప్రాంతానికి చెందిన హిమశ్రీ బోరో(20) విశాఖలో నృత్య పోటీల్లో పాల్గొనేందుకు వచ్చింది. స్నేహితులంతా అక్కడే ఉండిపోగా ఆమె మాత్రం మరుసటి రోజు పరీక్ష ఉందని ఈ నెల 6న విశాఖ నుంచి బయల్దేరింది.

**అర్ధరాత్రి 2.30 గంటలకు ఫోన్**

అర్ధరాత్రి 12:30 గంటల సమయంలో కన్యాకుమారి-డిబ్రూగఢ్ వివేక్ ఎక్స్‌ప్రెస్ ఎక్కింది. కోచ్ నంబరు ఎస్-2లో ప్రయాణిస్తున్న ఆమె 1 గంట సమయంలో కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడింది. కొందరు మద్యం తాగుతున్నారని, భయంగా ఉందని చెప్పింది. రాత్రి 2.30 గంటల తరువాత కుటుంబ సభ్యులు ఆమెకు ఫోన్ చేయగా సంకేతాలు అందలేదు. దీంతో భయాందోళనకు గురైన తల్లిదండ్రులు, వెంటనే రైల్వే హెల్ప్‌లైన్ 139తో పాటు గౌహతి రైల్వే పోలీసులకు కంప్లైంట్ చేశారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు వివేక్ ఎక్స్‌ప్రెస్‌లోని ఎస్2 కోచ్‌లో ఆమె బ్యాగ్‌ను గుర్తించారు కానీ ఆ యువతి ఆచూకీ దొరకలేదు. రైలు వెళ్లిన మార్గంలో గాలింపు చర్యలు చేపట్టగా ఆమదాలవలస-పొందూరు రైల్వేస్టేషన్ల మధ్య బొడ్డేపల్లి పేట వద్ద 7వ తేదీ ఉదయం జీఆర్పీ పోలీసులు ఆమె మృతదేహాన్ని పట్టాల వద్ద కనుగొన్నారు.

**మూడు నిమిషాల వీడియో**

ఆమదాలవలస జీఆర్పీ సిబ్బంది రైలు నుంచి జారి పడి మృతి చెందినట్లు కేసు నమోదు చేసి మృతదేహాన్ని శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి తరలించి భద్రపరిచారు. ఆమె రెండు బ్యాగ్‌లు కోచ్‌లోనే భద్రంగా ఉన్నట్లు గుర్తించారు. చరవాణిలో మద్యం తాగుతున్న వ్యక్తులను చిత్రీకరించిన మూడు నిమిషాల వీడియో ఆధారాలు పోలీసులకు లభించినట్లు తెలుస్తోంది. మృతదేహం వద్ద లభించిన ఆధార్‌కార్డు వివరాల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మరోవైపు ఆమె చదువుతున్న కళాశాలలో విద్యార్థులు నిరసన చేసినట్లు తెలిసింది. మృతురాలి కుటుంబ సభ్యులు గురువారం శ్రీకాకుళం చేరుకుని మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని కలిసి పరిస్థితి వివరించారు. వారి అభ్యర్థన మేరకు ఎస్పీ ఘటనా స్థలాన్ని సందర్శించారు. సభ్యుల నుంచి ఫిర్యాదును స్వీకరించి విచారణ చేపట్టే బాధ్యత సీఐకి అప్పగించారు. జారి పడి మృతి చెందిందా? ఎవరైనా తోసేశారా? రైల్లో ఏం జరిగింది? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**చంద్రబాబుకు అసోం సీఎం లేఖ**

యువతి మృతిపై అసోం ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ, సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. "హిమశ్రీ బోడో విషాదకర మరణం మాకు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. ఈ దుఃఖ సమయంలో ఆమె కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఈ రోజు లేఖ రాశాను. అక్కడి చట్టాల అమలు, సంస్థలతో సమన్వయం చేసుకోవడానికి అస్సాంకు చెందిన ఒక సీనియర్ పోలీసు అధికారిని ఆంధ్రప్రదేశ్‌కు పంపాను" అని హిమంత బిస్వా లేఖలో పేర్కొన్నారు.

# గెజిట్ వెలువరిస్తేనే నోటిఫికేషన్

మొదటి పేజీ తరువాయి...

జాబితానే పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రస్తుత ఓటర్ల జాబితాతో ఎన్నికలు నిర్వహిస్తామని ఎస్ఈసీ చెప్పుకొచ్చారు. రిజర్వేషన్లు ఖరారైతే రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తామని అన్నారు. ఆ తర్వాతే స్థానిక నోటిఫికేషన్ ప్రకటిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే సూచనల ఆధారంగా ఈ ఎన్నికలకు తాము సిద్ధంగా ఉంటామని ఎస్ఈసీ అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. కాగా, ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సర్ ప్రక్రియ తరువాతే స్థానిక ఎన్నికలు జరపాలనే వైసీపీ వాదనను తోసిపుచ్చింది. ఎన్నికలకు ఆటంకం కలిగించడమంటే ప్రజాప్రయోజనాలను అడ్డుకోవడమేనని పేర్కొంది. ఈ విషయమై వైసీపీ వేసిన పిటిషన్‌ను చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం తోసిపుచ్చింది.

# పార్టీ పరంగా 34 శాతం రిజర్వేషన్లు అమలు

మొదటి పేజీ తరువాయి...

ముఖ్యమంత్రి వెల్లడించారు. "రైతులు అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకూడదు. మీ భూమికి మీరే యజమానులు. ఎలాంటి భూ వివాదాలకు తావులేకుండా సమగ్ర రీ-సర్వే పూర్తి చేసి పాస్‌పుస్తకాలు ఇస్తున్నాం" అని ఆయన పేర్కొన్నారు. దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని భూ వివాదాలను పరిష్కరించి రైతులకు హక్కు పత్రాలు అందజేశారు.

గత వైఎస్సార్సీపీ ప్రభుత్వంపై సభలో తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు చంద్రబాబు. తమకు వ్యతిరేకంగా ఉన్న ప్రజలకు చెందిన 16.4 లక్షల ఎకరాల భూములను గత పాలకులు నిరోధిత జాబితాలో (సెక్షన్ 22ఏ) పెట్టారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో భూములకు రక్షణ లేకుండా పోయిందని, ప్రజలు ఇళ్లల్లోనూ, బయట కూడా భయంతో బతికారన్నారు.

**బీసీ రిజర్వేషన్లు ఊ స్థానిక సంస్థల ఎన్నికలు**

బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల జీవోను సుప్రీంకోర్టు రద్దు చేసినప్పటికీ, తమ పార్టీ (టీడీపీ) తరఫున బీసీలకు 34 శాతం సీట్లు కేటాయిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. గతంలో టీడీపీ ప్రభుత్వం తెచ్చిన 34 శాతం బీసీ రిజర్వేషన్లను వైఎస్సార్సీపీ ప్రభుత్వం 24 శాతానికి తగ్గించిందని, దాన్ని కూటమి ప్రభుత్వం రాగానే మళ్లీ 34 శాతానికి పెంచితే కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకున్నారని మండిపడ్డారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) నెపంతో స్థానిక సంస్థల ఎన్నికలను నిలిపివేసేందుకు ప్రతిపక్షం కుట్ర చేస్తోందని ఆరోపించారు.

**'మీ భూమి - మీ హక్కు', అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

'మీ భూమి - మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా సీఎం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ముప్పాళ్ల గ్రామంలో రూ.28 కోట్లతో నిర్మించనున్న వారధి నిర్మాణానికి పునాది రాయి వేశారు. అలాగే రూ.166 కోట్ల వ్యయంతో పోతుల చెంచయ్య పాలేరు జలాశయం ప్రాజెక్టును రెండు సంవత్సరాల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ రిజర్వాయర్ పూర్తయితే ఈ ప్రాంతంలో 9,500 ఎకరాలకు సాగునీరు అందడమే కాకుండా 15 గ్రామాల్లోని 35,000 మందికి తాగునీరు అందుతుందని చంద్రబాబు నాయుడు తెలిపారు.

**సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టులపై ప్రణాళికలు**

ఇటీవల చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ.. విజయవాడ, విశాఖపట్నం, మంగళగిరి ప్రాంతాల్లో రూ.52,000 కోట్ల విలువైన నివాస స్థలాల హక్కులను 60,000 మందికి కల్పించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల ఇళ్లకు శంకుస్థాపన చేశామని, త్వరలోనే మరో ఆరు లక్షల ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. వంశధార నుంచి పెన్నా వరకు 40 చిన్న, పెద్ద నదులను అనుసంధానిస్తూ వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేస్తామని, గోదావరి - కావేరి నదుల అనుసంధానం ద్వారా నాలుగు రాష్ట్రాల నీటి ఎద్దడి తీరుతుందన్నారు. వచ్చే మూడేళ్లలో రూ.35,000 కోట్ల వ్యయంతో 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# 34 శాతం రిజర్వేషన్లు కుదరవు

మొదటి పేజీ తరువాయి...

ఏమాత్రం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది.డెడికేటెడ్ కమిషన్ నివేదికను అమలు చేస్తున్నట్లు ఎక్కడుందని వ్యాఖ్యానించింది. 34 శాతం కోటాతో మొత్తం రిజర్వేషన్లు 50 శాతం పరిమితిని దాటుతున్నాయంటూ ప్రభుత్వం జారీ చేసిన రెండు జీవోలను హైకోర్టు ఇటీవల కొట్టివేసిన సంగతి తెలిసిందే. దీంతో రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకునేందుకు జస్టిస్ దీపాంకర్ దత్తా ధర్మాసనం నిరాకరించింది. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.... ఆగస్టు 18న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు 34 శాతం కోటా ఇస్తున్నట్లు ప్రకటించారు. ఎన్నికల్లో బీసీలకు నామినేటెడ్ పదవులతో పాటు స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పిస్తామని గతంలో ఇచ్చిన హామీ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కూడా పేర్కొన్నారు. అయితే రాజ్యాంగబద్ధంగా 50 శాతం రిజర్వేషన్ల పరిమితి దాటుతుండటంతో హైకోర్టు దీనిని రద్దు చేయగా.... సుప్రీంకోర్టు కూడా హైకోర్టు నిర్ణయాన్ని సమర్థించింది. దీంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ప్రక్రియపై మళ్లీ అనిశ్చితి ఏర్పడింది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం 50 శాతం పరిమితికి లోబడే రిజర్వేషన్లు ఖరారు చేసి స్థానిక ఎన్నికలకు వెళ్లాల్సి ఉంటుందని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు.

# ఢిల్లీ అష్టదిగ్బంధనం

మొదటి పేజీ తరువాయి...

నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఇప్పటికే పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. తాజా ఆదేశాల ప్రకారం.. ఈరోజు అర్ధరాత్రి నుంచి ఢిల్లీ నగరాన్ని పోలీసులు అష్టదిగ్బంధనం చేయనున్నారు. మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేయనున్నారు. దేశ రాజధానిలో దుకాణాలు, కార్యాలయాలను మూసివేయాలని ఆదేశించారు. రాత్రి 10 గంటల నుంచి 57 మెట్రో స్టేషన్ల గేట్లను మూసివేయనున్నారు. అలాగే, న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లలో పలు సర్వీసులను నిలిపివేశారు. హోటళ్లు, పీజీ హాస్టళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. సెంట్రల్ ఢిల్లీలో భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)లోని సెక్షన్ 163 అమలు చేస్తున్నారు. నగరంలో ఎలాంటి నిరసనలు, ధర్నాలకు అనుమతి లేదని మైకుల ద్వారా ప్రచారం చేస్తున్నారు. సున్నితమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. సెంట్రల్ ఢిల్లీ వ్యాప్తంగా 23 వేల మంది కేంద్ర బలగాలతో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టారు. కాగా, అక్టోబర్ 10 నుంచి క్రాకోచ్ జనతా పార్టీ ధర్నాకు పిలుపునిచ్చింది. ఈ నిరసనకు ఢిల్లీ పోలీసులు అనుమతి నిరాకరించారు. అయితే, తమకు అనుమతి ఇవ్వాలని కోరుతూ సుప్రీంకోర్టును సీజేపీ ఆశ్రయించింది. దీనిపై నేడు విచారణ జరిపిన ధర్మాసనం.. శాంతియుత నిరసనలకు జంతర్ మంతర్ కాకుండా మరోచోట అనుమతి ఇవ్వాలని ఆదేశించింది. అవసరమైన మేరకే నియంత్రణ చర్యలు చేపట్టాలని పేర్కొంటూ ఆదేశాలు జారీ చేసింది.

# రోగుల సేవే లక్ష్యం..జిజి హెచ్ ప్రక్షాళనే ధ్యేయం!

### సూపరింటెండెంట్ రాంబాబు ప్రత్యేక కార్యాచరణ

### హెల్ప్‌డెస్క్ ఏర్పాటు.. పారిశుధ్యం, భద్రతపై నిఘా.. అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట। పుష్కరాల నేపథ్యంలో ఆసుపత్రి అభివృద్ధికి ప్రణాళికలు

**రాజమహేంద్రవరం, అక్టోబర్ 9 ( పళ్ళా సత్యన్నారాయణ ప్రత్యేక ప్రతినిధి జయ జయహే):**

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి పేద రోగికి నాణ్యమైన వైద్యం అందించడంతోపాటు, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు కల్పించడమే లక్ష్యంగా రాజమహేంద్రవరం ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నట్లు సూపరింటెండెంట్ డా. ఎం. రాంబాబు తెలిపారు. హెల్ప్‌డెస్క్ ఏర్పాటు నుంచి పారిశుధ్యం, భద్రత, ఆహార నాణ్యత, అత్యవసర వైద్య సేవల మెరుగుదల వరకు ప్రతి అంశంపై దృష్టి సారిస్తున్నామని 'జయ జయహే'కు ఇచ్చిన ప్రత్యేక ముఖాముఖిలో వెల్లడించారు.

**రోగులకు మార్గదర్శిగా హెల్ప్‌డెస్క్**

ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకులు వివిధ విభాగాల కోసం తిరగకుండా ప్రధాన ద్వారం వద్ద లాబీలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయనున్నట్లు రాంబాబు తెలిపారు. ఓపీ, ల్యాబొరేటరీ, సదరం తదితర సేవలకు సంబంధించిన సమాచారం అందించడంతోపాటు, విభాగాలను సులభంగా గుర్తించేందుకు సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

**పారిశుధ్యం, భద్రతపై ప్రత్యేక నిఘా**

ఆసుపత్రిలో పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు పారిశుధ్య సిబ్బంది హాజరు, విధులు, పనితీరును పర్యవేక్షిస్తామని తెలిపారు. ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఎస్) ద్వారా హాజరు పరిశీలనకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. సెక్యూరిటీ సిబ్బంది విధులపైనా నిఘా ఉంచి, ఆసుపత్రిలో భద్రతను మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.




**రోగులకు నాణ్యమైన ఆహారం**

చికిత్స పొందుతున్న రోగులకు అందించే ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తామని సూపరింటెండెంట్ తెలిపారు. డైట్ క్యాంటీన్ నిర్వహణ, ఆహార తయారీ, పంపిణీని పర్యవేక్షించేందుకు ఇన్‌ఛార్జిని నియమించి, రోగుల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరిస్తామని వివరించారు.

**క్రిటికల్ కేర్, ఐసీయూ సేవల విస్తరణకు చర్యలు**

అత్యవసర పరిస్థితుల్లో రోగులకు సకాలంలో మెరుగైన వైద్యం అందించేందుకు క్రిటికల్ కేర్ బ్లాక్ సేవలను బలోపేతం చేస్తామని రాంబాబు వెల్లడించారు. ఐసీయూ విస్తరణతోపాటు క్యాజువాలిటీ విభాగాన్ని మెరుగుపరిచే అంశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

**అక్రమ వసూళ్లపై కఠిన చర్యలు**

ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవల కోసం ఎవరైనా అనధికారికంగా డబ్బులు అడిగితే ఉపేక్షించబోమని రాంబాబు స్పష్టం చేశారు. బాధితులు రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. రోగులతో మర్యాదగా వ్యవహరించడం, వారికి అవసరమైన సమాచారం అందించడం ప్రతి సిబ్బంది బాధ్యతని పేర్కొన్నారు.

**ప్రత్యేక సేవలపై పర్యవేక్షణ**

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, గిరిజన రోగులకు అందించే సేవలు, అంబులెన్స్ సదుపాయాలు, మహాప్రస్థానం సేవలు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంబులెన్స్



సేవల్లో ఎదురవుతున్న సమస్యలను సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

**2028 పుష్కరాలకు ముందస్తు ప్రణాళికలు**

2028 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని జీజీహెచ్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు రాంబాబు తెలిపారు. ఆసుపత్రి మరమ్మతులు, అంతర్గత రహదారులు, వైద్య పరికరాలు, ఇతర సదుపాయాల అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేసి, జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, సంబంధిత ఉన్నతాధికారులు, మంత్రి దృష్టికి తీసుకెళ్తామని వివరించారు.

**ప్రజలకు మెరుగైన వైద్య సేవలే ప్రాధాన్యం**

ఆసుపత్రి అభివృద్ధి అంటే భవనాలు, పరికరాల పెంపు మాత్రమే కాదని, రోగులకు నాణ్యమైన సేవలు అందించడం కూడా అంతే ముఖ్యమని సూపరింటెండెంట్ పేర్కొన్నారు. పారిశుధ్యం, భద్రత, ఆహార నాణ్యత, సిబ్బంది పనితీరు, ఫిర్యాదుల పరిష్కారంపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని తెలిపారు. ప్రభుత్వ వైద్య సేవలపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతూ, రాజమహేంద్రవరం జీజీహెచ్‌ను మరింత ప్రజానుకూలంగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని రాంబాబు స్పష్టం చేశారు.

# బంగాళాఖాతంలో అలజడి

### మూడు రోజుల్లో అల్పపీడనం ఏర్పడే ఛాన్స్

### 12 నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు

**(అమరావతి - జయజయహే)**

బంగాళాఖాతంలో వాతావరణ పరిస్థితులు వేగంగా మారుతున్నాయి. ఉత్తర అండమాన్ సముద్రంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆగ్నేయ బంగాళాఖాతంలో మంగళవారం నాటికి సరికొత్త అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. దీని ప్రభావంతో తెలుగు రాష్ట్రాలు, ముఖ్యంగా తీర ప్రాంతాల్లో మరోమారు వర్షాలు కురిసే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. వాతావరణ శాఖ సమాచారం ప్రకారం.. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడబోయే ఈ అల్పపీడనం తదుపరి 3 నుంచి 4 రోజుల్లో మరింతగా బలపడనుంది. అనంతరం ఇది పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్ర తీరాల దిశగా పయనించే అవకాశాలున్నట్లు అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో గాలుల తీవ్రత పెరగడంతో పాటు మోస్తరు నుంచి విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది.

**వాయుగుండంగా మారే ఛాన్స్..**

ఈ అల్పపీడనం తీవ్రతపై అంతర్జాతీయ, జాతీయ వాతావరణ మోడల్స్ భిన్నమైన అంచనాలను వెల్లడిస్తున్నాయి. బుధవారం నాటికి ఇది తీవ్రరూపం దాల్చి వాయుగుండంగా మారవచ్చని కొన్ని వాతావరణ నమూనాలు విశ్లేషిస్తున్నాయి. మరోవైపు ఇది వాయుగుండంగా మారకుండా సాధారణ అల్పపీడనంగానే తీరం వైపు కొనసాగుతుందని మరికొన్ని మోడల్స్ సూచిస్తున్నాయి. ఈ వ్యవస్థ తీవ్రత, కదిలే కచ్చితమైన మార్గంపై రాబోయే 24 నుంచి 48 గంటల్లో పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికారులు స్పష్టం చేశారు.

**యంత్రాంగం అప్రమత్తం**

తీరప్రాంత ప్రజలు, ముఖ్యంగా మత్స్యకారులు సముద్రంలో పరిస్థితులపై ఎప్పటికప్పుడు వాతావరణ శాఖ జారీ చేసే హెచ్చరికలను గమనిస్తూ ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. అల్పపీడనం బలపడే కొద్దీ సముద్రం అల్లకల్లోలంగా మారే ప్రమాదం ఉండటంతో వేటకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. స్థానిక అధికార యంత్రాంగం కూడా అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

# మృతదేహాన్ని దుప్పట్లో చుట్టి దహనం

### పోలీసుల చిత్రహింసలే మృతికి కారణం

### కస్టోడియల్ డెత్‌కు ఏడుగురు పోలీసుల బాధ్యులు

### సాయికృష్ణ కస్టోడియల్ డెత్ పై కోర్టుకు సిట్ రిపోర్టు

**(విజయవాడ - జయజయహే)**

సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ కస్టడీ మృతి కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం కోర్టుకి ప్రాథమిక ఛార్జిషీట్‌ను సమర్పించింది. విజయవాడలోని కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో సాయికృష్ణ మృతి చెందడానికి పోలీసుల చిత్రహింసలే ప్రధాన కారణమని సిట్ తన నివేదికలో స్పష్టం చేసింది. ఈ కస్టోడియల్ ఘటనకు బాధ్యులుగా అప్పటి కృష్ణలంక సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజుతో పాటు మొత్తం ఏడుగురు పోలీసులను ఛార్జిషీట్‌లో నిందితులుగా సిట్ పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అత్యంత నిష్పక్షపాతంగా జరిపిన ఈ దర్యాప్తులో సుమారు 120 మంది సాక్షులను విచారించారు. కీలకమైన 263 ఆధారాల పత్రాలను 86 పేజీల నివేదికకు జతచేసి సిట్ అధికారులు కోర్టుకు సమర్పించారు. నాన్-బెయిలబుల్ వారెంట్‌పై ప్రకాశం జిల్లా మార్కాపురం నుంచి గాదె సాయికృష్ణను పోలీసులు విజయవాడకు తరలించారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో అతడిపై అమానుషంగా దాడి చేశారు. పోలీసుల దెబ్బలు తట్టుకోలేక ఆరోగ్యం క్షీణించి సాయికృష్ణ ప్రాణాలు కోల్పోగా, అనంతరం ఆ నేరాన్ని కప్పిపుచ్చేందుకు నిందితులు దారుణంగా వ్యవహరించారు. అర్ధరాత్రి వేళ గుట్టుచప్పుడు కాకుండా దుప్పటిలో చుట్టి శ్మశానవాటికకు తరలించి సాయికృష్ణ మృతదేహాన్ని దహనం చేసినట్లు దర్యాప్తులో తేలింది.

**కస్టడీ హత్యను దాచి**

ఈ కేసులో నిందితులు పక్కా ప్లాన్ ప్రకారం పీఎస్ లోపల, బయట సాక్ష్యాధారాలను ధ్వంసం చేశారని సిట్ కోర్టుకు తెలిపింది. నిబంధనలకు విరుద్ధంగా లాకప్ డైరీ, జనరల్ డైరీ, సెంట్రీ బుక్‌లలో గాదె సాయికృష్ణకు సంబంధించిన ఎలాంటి సమాచారాన్ని ఎంట్రీ చేయలేదని సిట్ గుర్తించింది. పోలీస్ స్టేషన్‌లోని సీసీటీవీ ఫుటేజీని మాయం చేయడం, నేరం జరిగిన ఆనవాళ్లు లేకుండా లాకప్‌ను నీళ్లతో కడిగేసి పీఎస్‌కు కొత్తగా రంగులు వేయించడం చేసి ఆధారాలు ధ్వంసం చేయడానికి యత్నించారని సిట్ అధికారులు ఛార్జిషీట్‌లో స్పష్టం చేశారు. సాయికృష్ణ మృతికి ఈ ఏడుగురు నిందితులే ప్రత్యక్ష బాధ్యులని తేల్చిన సిట్, ఈ కేసుపై మరింత లోతుగా దర్యాప్తు ఇంకా కొనసాగుతోందని కోర్టుకు తెలిపింది.



# ప్రజల గుండెల్లో జక్కంపూడి!

### నాన్న ఆశయాలే మా బాట.. ప్రజాసేవే మా లక్ష్యం: జక్కంపూడి రాజా

**రాజమహేంద్రవరం: జయ జయహే : అక్టోబర్ 9:**

మాజీ మంత్రి, దివంగత జక్కంపూడి రామ్మోహన్ రావు వర్ధంతి సందర్భంగా కంబాల చెరువు జంక్షన్‌లోని ఆయన విగ్రహానికి నాయకులు, అభిమానులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కోడి కోట మిత్రబృందం, జక్కంపూడి రామ్మోహన్ రావు అభిమాన సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సిపి పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ, రామ్మోహన్ రావు ప్రజాసేవా జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన తనయులు జక్కంపూడి రాజా, జక్కంపూడి గణేష్ తండ్రి ఆశయాలను కొనసాగిస్తూ ప్రజలకు అండగా నిలవడం అభినందనీయమన్నారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సిపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా మాట్లాడుతూ, తన తండ్రి చూపిన ప్రజాసేవా మార్గంలోనే పయనిస్తూ, కార్మికులు, కర్షకులు, పేదలు సహా అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు. ప్రజల కష్టాల్లో అండగా నిలిచి, వారి హక్కుల కోసం పోరాడటమే తండ్రికి అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఎపి హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మేడపాటి షర్మిలా రెడ్డి మాట్లాడుతూ, జిల్లా రాజకీయాల్లో రామ్మోహన్ రావు చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, వైఎస్సార్‌సిపి మాజీ నగర అధ్యక్షుడు నందేపు శ్రీనివాస్ మాట్లాడుతూ, కార్మిక సంఘ నాయకుడిగా ప్రస్థానం ప్రారంభించి మంత్రిగా జిల్లా అభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎండీ ఆరిఫ్, వక్కపాటి మురళి తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని నివాళులర్పించారు.



# పరిసరాల పరిశుభ్రతే ప్రజా ఆరోగ్యానికి నాంది

### పారిశుధ్య కార్మికుల సేవలకు ఘన సన్మానం

**టెక్కలి అక్టోబర్ 9 జయ జయహే**

ప్రజా ఆరోగ్యానికి పరిసరాల పరిశుభ్రతకు నిత్యం సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికులకు సన్మానించడం చాలా హర్షదాయకమని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు తెలిపారు, భారత ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినోత్సవం పురస్కరించుకుని సేవా సంకల్ప అభియా న్ లో భాగంగా బిజెపి ప్రతినిధి ధూపాన రాజ్ కుమార్ సారథ్యంలో టెక్కలి పారిశుధ్య కార్మికుల కు సన్మానం చేసి మోదీ కిట్లును పంపిణీ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ స్వచ్ఛ భారత్ మిషన్ ఆలోచన ద్వారా వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం, అభివృద్ధి ప్రజలకు దగ్గరవుతుందని అన్నారు, పారిశుధ్య కార్మికుల నిస్వార్ధ సేవలు ఈ సమాజానికి ఎంతగానో మేలు జరుగుతుందని పలువురు బిజెపి నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి అధికారం ప్రతినిధి పూడి తిరుపతిరావు, జిల్లా ఇన్చార్జ్ ఎస్వీఎస్ ప్రకాష్ రెడ్డి, బిర్లంగి ఉమామహేశ్వరరావు, పోక తోట సింహాచలం, అట్టడ రవి బాబ్జి, జార్జాన రాంజీ ,బూరే నరేంద్ర,, అన్నేపు ఉమామహేశ్వరరావు, నడుపురి లక్ష్మీనారాయణ, జన్నీ పరమేశ్వరరావు, తాడేల భూపతి, పైల కావ్య, తమ్మినేని ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.




# మనసుకు భరోసా.. జీవితానికి భరోసా!

### మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు, ర్యాలీ

**రాజమహేంద్రవరం: జయ జయహే: అక్టోబర్ 9:**

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం మానసిక ఆరోగ్య అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్, అదనపు డీఎంఈ డా. ఎం.ఎస్. రాజు అధ్యక్షత వహించగా, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ న్యాయమూర్తి వై. శ్రీలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డా. ఎం.ఎస్. రాజు మాట్లాడుతూ శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక, సామాజిక శ్రేయస్సు కూడా ముఖ్యమని తెలిపారు. పని ఒత్తిడి, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, ఒంటరితనం మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయని, సమస్యలను దాచిపెట్టకుండా సకాలంలో సహాయం పొందాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్, అదనపు డీఎంఈ డా. కె. రాంబాబు మాట్లాడుతూ మానసిక సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి కౌన్సెలింగ్, వైద్య చికిత్స పొందాలని తెలిపారు. బాధితులను నిందించకుండా కుటుంబ సభ్యులు అండగా నిలవాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. న్యాయమూర్తి వై. శ్రీలక్ష్మి మాట్లాడుతూ కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవం మానసిక ఆరోగ్యానికి పునాదులని పేర్కొన్నారు. వృద్ధుల పట్ల శ్రద్ధ చూపడంతో పాటు పిల్లల భావోద్వేగాలు, ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని సూచించారు. మానసిక వైద్య విభాగాధిపతి డా. ఎన్. అన్నపూర్ణ మాట్లాడుతూ సమస్యలను మనసులో దాచుకోకుండా నమ్మకమైన వారితో పంచుకోవాలని తెలిపారు. డీ-అడిక్షన్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డా. దీప్తి మద్యం, పొగాకు తదితర వ్యసనాల నుంచి బయటపడేందుకు అందుబాటులో ఉన్న కౌన్సెలింగ్, వైద్య సేవలను వివరించారు. సైకియాట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. రామారెడ్డి తగిన నిద్ర, సమతుల ఆహారం, వ్యాయామం మానసిక ఆరోగ్య పరిరక్షణకు దోహదపడతాయని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డా. కె.వి. శివప్రసాద్ ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో సంతోషంగా ఉంటూ మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పాల్గొన్న వారితో మానసిక ఆరోగ్య పరిరక్షణపై ప్రతిజ్ఞ చేయించారు. మానసిక సమస్యలతో బాధపడుతున్న వారికి అండగా నిలుస్తూ, అపోహలు, వివక్షను తొలగించేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా. బ్యూలా, డా. దీప్తి, డా. అపర్ణ, డా. సీతారామరాజు, వివిధ విభాగాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, డీ-అడిక్షన్ సెంటర్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ విజయ, కౌన్సెలర్ వాసు, కేంద్ర సిబ్బంది, మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులు, సాయి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్, ప్రియదర్శిని కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.



# ఒక్కరి వీడ్కోలు.. నలుగురికి పునర్జన్మ

### రాజమండ్రి కిమ్స్ బొల్లినేనిలో తొలిసారి కిడ్నీ మార్పిడి..

**రాజమహేంద్రవరం: జయ జయహే :అక్టోబర్ 9:**

మరణంలోనూ మానవత్వం పరిమళించింది. బ్రెయిన్ డెడ్ అయిన అడపా సుధాకర్ అవయవదానంతో నలుగురు రోగులకు కొత్త జీవితంపై ఆశలు చిగురించాయి. తీవ్ర విషాదంలోనూ అవయవదానానికి ముందుకొచ్చిన ఆయన తల్లిదండ్రుల నిర్ణయం అందరికీ ఆదర్శంగా నిలిచింది. సుధాకర్ అవయవాలను విశాఖపట్నం, శ్రీకాకుళం, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లోని రోగులకు అమర్చినట్లు సమాచారం. రాజమండ్రి కిమ్స్ బొల్లినేని ఆసుపత్రిలో తొలిసారిగా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేపట్టడం స్థానిక వైద్య సేవల్లో కీలక ముందడుగుగా నిలిచింది. మూత్రపిండాల వైఫల్యంతో బాధపడుతున్న రోగులకు ఆధునిక చికిత్సను చేరువ చేయడంలో ఇది ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సందర్భంగా కిమ్స్ ఆంధ్రప్రదేశ్ సిఈఓ బొల్లినేని అద్విక్ మాట్లాడుతూ.. సుధాకర్ అవయవదానంతో నలుగురికి కొత్త జీవితం లభించడం గొప్ప విషయమని, ఆయన తల్లిదండ్రుల నిర్ణయం మానవత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. అవయవదానంపై ప్రజల్లో మరింత అవగాహన పెరగాలని, ఒకరి అవయవదానం పలువురి జీవితాల్లో వెలుగులు నింపుతుందని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించేలా కృషి చేస్తామని వెల్లడించారు.



# వేచలం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

**దేవరాపల్లి, అక్టోబర్ 9 జయ జయహే**

మండలంలోని వేచలం గ్రామం జెడ్ పి హైస్కూల్ లో 8వ తరగతి చదువుతున్న విధ్యార్థిని , విద్యార్థులకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఎన్ ఎం ఎం ఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రధానోపాధ్యాయులు వెంకటరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వెంకటరావు మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు అంతా ప్రణాళికా బద్ధంగా కష్టపడి 100 శాతం మార్కులు సాధించి , తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచిపేరు తేవాలని కోరారు. పూర్వ విద్యార్థులు, అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు , ఇతర ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## జీఎస్టీ సంస్కరణలు..

## చిన్న వ్యాపారులకు కొత్త ఊరట!

సి.హెచ్. ప్రతాప్

వ్యాపారం చేయడం కంటే పన్నుల నిబంధనలను పాటించడమే కష్టంగా మారితే ఆర్థికాభివృద్ధికి ఆటంకాలు తప్పవు. ముఖ్యంగా చిన్న వ్యాపారులకు సంక్లిష్టమైన పన్ను విధానాలు, రిటర్నుల దాఖలు, నోటీసులు, జరిమానాలు, రీఫండ్లలో జాప్యం తీవ్ర ఇబ్బందులు కలిగిస్తాయి. ఈ నేపథ్యంలో అక్టోబర్ 8న జరిగిన 57వ జీఎస్టీ మండలి సమావేశంలో ప్రతిపాదించిన సంస్కరణలు వ్యాపార వర్గాలకు కొత్త ఆశలు కల్పిస్తున్నాయి. పన్నుల వసూళ్లతోపాటు పన్ను చెల్లింపుదారుల సౌలభ్యానికీ ప్రాధాన్యం ఇవ్వడం ఈ నిర్ణయాల్లోని విశేషం.

భారత ఆర్థిక వ్యవస్థలో జీఎస్టీ ప్రాధాన్యం నిరంతరం పెరుగుతోంది. 2017లో జీఎస్టీ అమల్లోకి వచ్చినప్పుడు 66.5 లక్షల మంది పన్ను చెల్లింపుదారులుండగా, 2026 మే నాటికి వారి సంఖ్య 1.65 కోట్లకు చేరింది. 2017--18లో రూ.7.4 లక్షల కోట్లుగా ఉన్న వార్షిక జీఎస్టీ వసూళ్లు 2025--26 నాటికి రూ.22.27 లక్షల కోట్లకు పెరిగాయి. ఈ గణాంకాలు పన్ను వ్యవస్థ విస్తరణను సూచిస్తున్నాయి. అయితే వసూళ్లు పెరగడంతోపాటు చిన్న వ్యాపారులకు నిబంధనల భారం తగ్గడం కూడా అంతే ముఖ్యం.

తాజా ప్రతిపాదనల్లో రీఫండ్ల ప్రక్రియను వేగవంతం చేయడం అత్యంత కీలకం. అర్హమైన కొన్ని రీఫండ్ దరఖాస్తుల్లో కోరిన మొత్తంలో 90 శాతాన్ని తాత్కాలికంగా స్వయంచాలకంగా మంజూరు చేసే విధానం ప్రతిపాదించారు. దరఖాస్తు స్వీకరణకు ప్రస్తుతం ఉన్న 15 రోజుల గడువును 10 రోజులకు తగ్గించాలని నిర్ణయించారు. దీనివల్ల వ్యాపారుల నిర్వహణ మూలధనం అనవసరంగా నిలిచిపోకుండా ఉ ంటుంది. చిన్న పరిశ్రమలకు ఇది గణనీయమైన ప్రయోజనం.

పన్ను వివాదాల్లోనూ ముఖ్యమైన మార్పులు ప్రతిపాదించారు. రూ.10 వేలలోపు పన్ను వివాదాలకు షోకాజ్ నోటీసులు జారీ చేయకూడదని నిర్ణయించారు. సాధారణ




జరిమానా గరిష్ఠ పరిమితిని రూ.25 వేల నుంచి రూ.10 వేలకు తగ్గించనున్నారు. క్రిమినల్ విచారణకు సంబంధించిన ఆర్థిక పరిమితిని రూ.కోటి నుంచి రూ.5 కోట్లకు పెంచడంతోపాటు జీఎస్టీ అధికారుల అరెస్టు అధికారాలను తొలగించాలని సిఫార్సు చేశారు. నిజాయతీగా వ్యాపారం చేసేవారికి భరోసా కల్పిస్తూనే ఉ ద్దేశపూర్వక మోసాలను అరికట్టడం అవసరం.

ఈ-కామర్స్ వేదికల ద్వారా ఇతర రాష్ట్రాలకు ఉత్పత్తులు విక్రయించే చిన్న వ్యాపారులకు నమోదును సులభతరం చేయడం మరో ముందడుగు. వార్షిక టర్నోవర్ రూ.5 కోట్లలోపు ఉండి నేరుగా వినియోగదారులకు విక్రయించే అర్హులైన వ్యాపారుల కోసం వార్షిక రిటర్ను, త్రైమాసిక చెల్లింపుల ఐచ్ఛిక పథకానికి సూత్రప్రాయ ఆమోదం లభించింది. ఇది అమల్లోకి వస్తే చిరు వ్యాపారులకు సమయంతోపాటు నిర్వహణ వ్యయమూ ఆదా కావచ్చు.

అయితే సంస్కరణలు ప్రకటనలకే పరిమితం కాకూడదు. ప్రతిపాదిత చట్టసవరణలు, నిబంధనలు అమల్లోకి రావాలి. గ్రామీణ వ్యాపారులకు స్థానిక భాషల్లో అవగాహన కల్పించాలి. జీఎస్టీ పోర్టల్‌ను మరింత సరళీకరించాలి. రీఫండ్లకు నిర్ణీత గడువులు, ఫిర్యాదులకు త్వరిత పరిష్కారం, చిన్న వ్యాపారులకు ఉచిత సాంకేతిక సహాయం అందించాలి.

పన్ను వ్యవస్థ విజయానికి వసూళ్లే కొలమానం కాదు. భయం లేకుండా వ్యాపారం చేయగల వాతావరణమే నిజమైన ప్రమాణం. చిన్న వ్యాపారి ఎదిగితే ఉ పాధి పెరుగుతుంది, మార్కెట్ విస్తరిస్తుంది, దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుంది. జీఎస్టీ సంస్కరణల అంతిమ లక్ష్యం అదే కావాలి.

# వివేకః పరమం బలం

## వివేకమే మానవ జీవితానికి పరమశక్తి

(సి.హెచ్.ప్రతాప్)

**"వివేకః పరమం బలం" అనే సంస్కృత సూక్తికి "వివేకమే అత్యున్నతమైన బలం" అని అర్థం. శారీరక శక్తి మనిషిని యుద్ధరంగంలో గెలిపించవచ్చు, సంపద సౌకర్యాలను సమకూర్చవచ్చు, అధికారం ప్రభావాన్ని కల్పించవచ్చు, విద్య విజ్ఞానాన్ని ప్రసాదించవచ్చు. అయితే ఏది ధర్మం, ఏది అధర్మం, ఏది శాశ్వతం, ఏది క్షణికం, ఏది మేలు, ఏది కీడు అనే విషయాలను సమయోచితంగా గ్రహించి, సరైన నిర్ణయం తీసుకునే శక్తే వివేకం. ఈ వివేకమే వ్యక్తిత్వాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చే అంతరంగ బలం. అందుకే భారతీయ ఋషులు వివేకాన్ని మానవ జీవితానికి అత్యంత విలువైన సంపదగా అభివర్ణించారు.**



కఠోపనిషత్ ఈ సత్యాన్ని అత్యంత హృద్యంగా ప్రతిపాదిస్తుంది. "శ్రేయశ్చ ప్రేయశ్చ మనుష్యమేతః" అనే మంత్రం ద్వారా ప్రతి మనిషి ముందూ రెండు మార్గాలు నిలుస్తాయని ఉపదేశిస్తుంది. ఒకటి తక్షణ సుఖాన్ని అందించే ప్రేయోమార్గం, మరొకటి శాశ్వత శ్రేయస్సును ప్రసాదించే శ్రేయోమార్గం. ఈ రెండింటిలో శాశ్వత మేలును గుర్తించి శ్రేయోమార్గాన్ని ఎంచుకునే సామర్థ్యమే వివేకం. కాబట్టి వివేకం అనేది తెలివితేటల ప్రదర్శన కాదు; విలువలను ఆధారంగా చేసుకొని జీవనాన్ని సన్మార్గంలో నడిపించే అంతరంగ ప్రకాశం.

భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ స్థితప్రజ్ఞుని లక్షణాలను వివరిస్తూ సమబుద్ధి, ఆత్మనిగ్రహం, ధర్మనిష్ఠలను జ్ఞానానికి పునాదులుగా పేర్కొన్నాడు. గీత రెండవ అధ్యాయం సారాంశమే వివేకబుద్ధి. అనుకూల పరిస్థితుల్లో అహంకారానికి లోనుకాకుండా, ప్రతికూల పరిస్థితుల్లో నిరాశకు గురికాకుండా, ధర్మబద్ధంగా నిర్ణయాలు తీసుకునే వ్యక్తియే నిజమైన బలవంతుడు. బాహ్య విజయాల కంటే అంతరంగ సమతుల్యత గొప్పదని గీత బోధిస్తుంది.

ఆది శంకరాచార్యుల వివేకచూడామణిలో లి"నిత్యానిత్య వస్తు వివేకం"లిను ఆధ్యాత్మిక జీవనానికి తొలి అర్హతగా పేర్కొన్నారు. శాశ్వతమైనది ఏది, నశ్వరమైనది ఏది అనే స్పష్టమైన అవగాహన కలిగినవాడు జీవితంలో మోహాలకు బానిస కాడు. వివేకం మనిషిని భ్రమల నుండి బయటకు తీసుకువచ్చి సత్యానికి చేరువ చేస్తుంది. అదే వ్యక్తిత్వ వికాసానికి, ఆత్మోన్నతికి మూలాధారమవుతుంది.

యోగవాశిష్ఠంలో మహర్షి వశిష్ఠుడు శ్రీరామునికి చేసిన ఉపదేశం కూడా ఇదే భావాన్ని ప్రతిధ్వనిస్తుంది. అజ్ఞానం మనిషిని బంధిస్తే, వివేకం విముక్తి వైపు నడిపిస్తుంది. కోపం, అసూయ, మోహం, అహంకారం వంటి అంతరంగ శత్రువులను జయించగల శక్తి ఆయుధాలలో లేదు; అది వివేకంలోనే ఉంది. అంతరంగాన్ని జయించినవాడే ప్రపంచాన్ని జయించగలడని ఈ గ్రంథం సందేశమిస్తుంది.

భారతీయ ఇతిహాసాలు కూడా వివేక మహిమను ఎన్నో సందర్భాల్లో చాటాయి. రామాయణంలో శ్రీరాముడు ప్రతి నిర్ణయాన్ని ధర్మం అనే ప్రమాణంతో పరిశీలించి ఆచరించాడు. మహాభారతంలో విదురుని నీతి, భీష్మని ధర్మబోధలు రాజనీతి, సామాజిక నీతి, వ్యక్తిగత విలువలకు నిత్య మార్గదర్శకాలుగా నిలిచాయి. బలప్రయోగం సాధించలేని విజయాలను వివేకం సులభంగా సాధించగలదని ఈ ఇతిహాసాలు నిరూపించాయి.

నేటి సమాచార విస్ఫోటన యుగంలో జ్ఞానం సమృద్ధిగా లభిస్తున్నా, వివేకం కొరవడితే ఆ జ్ఞానమే వినాశనానికి కారణమవుతుంది. సామాజిక మాధ్యమాలు, సాంకేతిక పురోగతి, కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక సాధనాల మధ్య వాస్తవాన్ని అసత్యం నుండి వేరు చేయడం, భావోద్వేగాల కంటే విలువలకు ప్రాధాన్యం ఇవ్వడం, తక్షణ లాభాల కంటే దీర్ఘకాల శ్రేయస్సును ఎంచుకోవడం ప్రతి వ్యక్తి బాధ్యత. ఈ నిర్ణయ సామర్థ్యాన్నే వివేకం అంటారు.

శారీరక బలం కాలంతో క్షీణిస్తుంది. సంపదలు వచ్చి పోతుంటాయి. అధికారాలు శాశ్వతం కావు. కానీ వివేకం మాత్రం జీవితాంతం మనిషిని రక్షించే అంతరంగ దీపస్తంభంలా నిలుస్తుంది. అది సరైన ఆలోచనను, ధర్మబద్ధమైన నిర్ణయాన్ని, నైతిక ధైర్యాన్ని, సమాజహిత దృష్టిని ప్రసాదిస్తుంది. అందుకే భారతీయ జ్ఞాన సంప్రదాయం "వివేకః పరమం బలం" అని శాశ్వత సత్యాన్ని ప్రకటించింది. నిజమైన బలం కండరాల్లో లేదు; ధర్మాన్ని గ్రహించే బుద్ధిలో, సత్యాన్ని అనుసరించే హృదయంలో, మానవత్వాన్ని నిలబెట్టే వివేకంలోనే ఉంది. ఇదే ఈ మహోన్నత సూక్తి మానవాళికి అందించే నిత్యనూతన జీవన సందేశం.

# విలక్షణ నటుడు నానా పటేకర్

(సి.హెచ్. ప్రతాప్)

**నటన అంటే కేవలం సంభాషణలు పలకడం కాదు. పాత్రలో జీవించడం, భావోద్వేగాలను కళ్లతోనే వ్యక్తీకరించడం, ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేయడం. ఈ లక్షణాలన్నింటికీ నిలువెత్తు నిదర్శనం నానా పటేకర్. సహజమైన నటన, విలక్షణమైన స్వరం, పదునైన సంభాషణలు, అసాధారణ హావభావాలతో భారతీయ చిత్రసీమలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న ఈ మహానటుడు అక్టోబర్ 8న కన్నుమూశారు. 75 ఏళ్ల వయసులో ఆయన నిష్క్రమణతో భారతీయ సినిమా ఒక గొప్ప నటుడిని కోల్పోయింది.**



1951 జనవరి 1న మహారాష్ట్రలో జన్మించిన ఆయన అసలు పేరు విశ్వనాథ్ పటేకర్. రంగస్థల నటుడిగా ప్రస్థానం ప్రారంభించి, 1978లో విడుదలైన 'గమన్' చిత్రంతో వెండితెరకు పరిచయమయ్యారు. దాదాపు 48 సంవత్సరాల సినీ ప్రయాణంలో హిందీ, మరాఠీ, తమిళ భాషల్లో సుమారు వంద చిత్రాల్లో నటించారు. కథానాయకుడిగా, ప్రతినాయకుడిగా, హాస్యనటుడిగా, సహాయ నటుడిగా విభిన్న పాత్రలకు ప్రాణం పోశారు.

1986లో 'అంకుశ్' ఆయనకు గుర్తింపు తీసుకురాగా, 1988లో 'సలామ్ బాంబే', 1989లో 'పరిందా' చిత్రాలు నటుడిగా ఆయన స్థాయిని పెంచాయి. 'తిరంగా', 'క్రాంతివీర్', 'అగ్నిసాక్షి', 'ఖామోషి', 'యశ్వంత్', 'అబ్ తక్ ఛప్పన్', 'అపహరణ్', 'రాజ్‌నీతి', 'వెల్‌కమ్' చిత్రాలు ఆయన వైవిధ్యానికి నిదర్శనాలు. ముఖ్యంగా 'క్రాంతివీర్'లో సామాజిక అన్యాయాన్ని ప్రశ్నించే పాత్ర, 'వెల్‌కమ్'లో ఉ దయ్‌శెట్టి హాస్యపాత్ర ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

నానా పటేకర్ ప్రతిభకు మూడు జాతీయ చలనచిత్ర పురస్కారాలు లభించాయి. 'పరిందా' (1989), 'అగ్నిసాక్షి' (1996) చిత్రాలకు ఉత్తమ సహాయ నటుడిగా, 'క్రాంతివీర్' (1994) చిత్రానికి ఉత్తమ నటుడిగా జాతీయ పురస్కారాలు అందుకున్నారు. 'పరిందా', 'అంగార్', 'క్రాంతివీర్', 'అపహరణ్' చిత్రాలకు నాలుగు హిందీ ఫిల్మ్‌ఫేర్ అవార్డులు దక్కాయి. మరాఠీ చిత్రాలకు రెండు ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు అందుకున్నారు. 2013లో కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీతో గౌరవించింది.

2016లో విడుదలైన మరాఠీ చిత్రం 'నటసమ్రాట్' ఆయన నటజీవితంలో మరో శిఖరం. వృద్ధ రంగస్థల నటుడి జీవితంలోని అవమానాలు, ఒంటరితనం, వేదనలను అత్యంత సహజంగా ఆవిష్కరించి ప్రేక్షకులను కదిలించారు. నటుడిగానే కాకుండా 'ప్రహార్' (1991) చిత్రానికి దర్శకత్వం వహించి బహుముఖ ప్రతిభను చాటుకున్నారు.

2026 ఫిబ్రవరిలో విడుదలైన 'ఓ రోమియో' ఆయన చివరిగా విడుదలైన ప్రధాన థియేట్రికల్ చిత్రం. మార్చిలో ఓటీటీలో విడుదలైన 'సుబేదార్'లో అతిథి పాత్రలో కనిపించారు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న 'శక్తి శాలిని'తోపాటు మరికొన్ని చిత్రాలు ఆయన మరణానంతరం విడుదల కానున్నాయి.

సినిమాలకే పరిమితం కాకుండా రైతుల సంక్షేమానికి జీవితాన్ని అంకితం చేశారు. 2015లో నటుడు మకరంద్ అనాస్పురేతో కలిసి 'నామ్ ఫౌండేషన్' స్థాపించారు. కరవు బాధితులకు, ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారు. ఈ సంస్థ సేవలు లక్షలాది రైతులకు చేరాయి.

పాత్ర ముగిసినా ప్రేక్షకుల మనసుల్లో నటుడు జీవిస్తూనే ఉంటాడు. నానా పటేకర్ విషయంలో అది అక్షరసత్యం. ఆయన మరణంతో ఒక నటుడు మాత్రమే కాదు, భారతీయ చిత్రసీమలో సహజ నటనకు నిలువెత్తు ప్రతిరూపం కనుమరుగైంది. తెరపై ఆయన సృష్టించిన పాత్రలు మాత్రం తరతరాలకూ చిరస్మరణీయంగా నిలిచిపోతాయి.




### ఆది ఆంధ్ర కాలనీ ఎత్తిపోతల పథకం

## సాధనకై పోరాటం

### నేటికీ ఏడేళ్లయినా చలనం లేని ప్రాజెక్టు నిర్మాణం

### రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే సాగని అభివృద్ధి పనులు

### ప్రజా హక్కుల సాధనకై సిపిఎం డిమాండ్

టెక్కలి అక్టోబర్ 9 జయ జయహే

శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలంలోని మారుమూల గిరిజన గ్రామాల 1500 ఎకరాల పంట పొలాలకు స్థానికులకు సాగునీరు తాగునీరు ముఖ్య లక్ష్యంగా నిర్మించ తలపెట్టిన ఆది ఆంధ్ర కాలనీ ఎత్తిపోతల పథకం 2019 లో నేటి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చం నాయుడు శంకుస్థాపన చేసి న ఈ పథకం అలసత్వంతో ఆగిపోయిందని శ్రీకాకుళం జిల్లా సిపిఎం ప్రధాన కార్యదర్శి డి గోవిందరావు ఆరోపించారు.

టెక్కలి చింతామణి రెవెన్యూ గ్రూపులోని అది ఆంధ్ర వీధి, ఆంజనేయపురం, నువ్వు గుడ్డి, సవర గోపాలపురం, చిన్న కేదారి, వెంకటాపురం గిరిజన గ్రామాల వ్యవసాయానికి, త్రాగు నీటి సరఫరా కోసం ఈ ఎత్తిపోతల పథకాన్ని శంకుస్థాపన జరిగిందని ఇది ఆదిలోనే ఆగిపోయిందని సిపిఎం సభ్యులు విమర్శించారు. ఆది ఆంధ్ర వీధి కనీసం మౌలిక సదుపాయాలు తీర్చలేని పరిస్థితుల్లో ప్రభుత్వము కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చం నాయుడు, ఈ ప్రాంతంపై నిర్లక్ష్యం వహించారని స్థానికులు, సిపిఎం ప్రతినిధులు ఆరోపిస్తున్నారు.

ఈ ప్రాంత సమస్యలు తీరనంతకాలం పోరాటం మరింత ఉధృతం చేస్తామని సిపిఎం ప్రతినిధులు డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ ప్రతినిధి నంబూరు షణ్ముఖరావు, మండల కన్వీనర్ కొల్లి ఎల్లయ్య, సిఐటియు జిల్లా నాయకులు హనుమంతు ఈశ్వరరావు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ పాలవలస ధర్మారావు, ఉర్జాన లక్ష్మణరావు, దాసరి నాగరాజు, ఎర్ర వెంకట్రావు, దా లయ్య, దాసరి అప్పయ్య నెయ్యిల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా కూటమితోనే

# ప్రజా ఉద్యమం బలోపేతం!

### ఆర్ పి సి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ పిలుపు

**రాజమహేంద్రవరం :జయ జయహే: అక్టోబర్ 9**

ఆంధ్రప్రదేశ్‌లో మోదీ, చంద్రబాబు కూటమి ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు ప్రజాస్వామ్య శక్తులన్నీ ఏకతాటిపైకి రావాలని ఆర్పీసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఇస్తున్న మద్దతును ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ప్రజాగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ఎపిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆధ్వర్యంలో విజయవాడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మేడా శ్రీనివాస్ పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలపై ఉద్యమాన్ని పూర్తి స్థాయిలో బలోపేతం చేయడానికి అన్ని ప్రజాస్వామ్య, ప్రజా ఉద్యమ శక్తులు ఐక్యంగా ముందుకు రావాలన్నారు.మోదీ, చంద్రబాబు కూటములకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిలిచే శక్తులన్నింటినీ సమన్వయం చేస్తూ 'ప్రజా కూటమి' ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు. ప్రజా సమస్యల పరిష్కారం, ప్రజా హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ఐక్య ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని మేడా శ్రీనివాస్ స్పష్టం చేశారు.



## ఎన్నికల వేళ.. ఖాకీ నిఘా

**రాజమహేంద్రవరం: జయ జయహే : అక్టోబర్ 9**

రానున్న మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశించారు. రాజమహేంద్రవరం వన్‌టౌన్, త్రీటౌన్ పోలీస్ స్టేషన్లను సందర్శించిన ఆయన ఎన్నికల భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి పటిష్ట భద్రత కల్పించాలని సూచించారు. పాత నేరస్తులు, రౌడీషీటర్లపై నిఘా ఉంచడంతోపాటు, గొడవలకు పాల్పడే అవకాశం ఉన్నవారిపై ముందస్తు బైండోవర్ చర్యలు తీసుకోవాలని, పెండింగ్ నాన్ బెయిలబుల్ వారెంట్లను అమలు చేయాలని ఆదేశించారు.ఎన్నికల సమయంలో సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు, వదంతులు, రెచ్చగొట్టే పోస్టులు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి వార్డు, ప్రాంతం, పోలింగ్ కేంద్రానికి సంబంధించిన సమాచారాన్ని సేకరించి, స్థానికులతో సమన్వయం చేసుకుంటూ శాంతిభద్రతలను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. గత ఎన్నికలకు సంబంధించిన కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ అసిస్టెంట్ ఎస్పీ తరుణ్ పహ్వా, వన్‌టౌన్ సీఐ ఎన్. మురళీకృష్ణ, త్రీటౌన్ సీఐ వి. అప్పారావు, డిసిఆర్‌బి సిఐ ఈ. పవన్ కుమార్ రెడ్డి, ఎస్‌బి సిఐ ఎ. శ్రీనివాసరావు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జనసేన పార్లమెంట్ కమిటీ సభ్యునిగా పీవీఎస్ఎన్ రాజు నియామకం

**చోడవరం, అక్టోబర్ 9 జయ జయహే**



స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జనసేన పార్టీ అనకాపల్లి పార్లమెంట్ సమన్వయ కమిటీ సభ్యునిగా చోడవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి పీవీఎస్ఎన్ రాజు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి కమిటీ నియామకాలకు సంబంధించిన శుక్రవారం ప్రకటన వెలువడింది. ఈ నియామకాల్లో పీవీఎస్ఎన్ రాజుతో పాటు అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, ఎలమంచిలి ఎమ్మెల్యే విజయకుమార్ కూడా ఉన్నారు.ఈ సందర్భంగా చోడవరం జనసేన పార్టీ ఇంచార్జ్ పీవీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ, పార్టీ తనకు అప్పగించిన ప్రతి బాధ్యతను చిత్తశుద్ధితో ఎల్లప్పుడు అంకితభావంతో నిర్వహిస్తూ వస్తున్నానని తెలిపారు. ప్రస్తుతం తనకు అప్పగించిన ఈ బాధ్యతను కూడా సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పార్టీ ప్రయోజనాలను కాపాడేందుకు కృషి చేస్తానన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి సమన్వయంతో పనిచేస్తానని, పార్టీ శ్రేణులను కలుపుకొని ముందుకు సాగుతానని పేర్కొన్నారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌కు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు.



## కుసుమ సాగుపై రైతులకు అవగాహన శిక్షణ కార్యక్రమం..

**కొయ్యూరు (జయ జయహే న్యూస్) అక్టోబర్ 10,**

కొయ్యూరు ప్రాంతంలో కొత్తగా 50 ఎకరాల్లో కుసుమ సాగు చేపడుతున్న దృష్ట్యా, పనసలపాడు గ్రామంలో రైతులకు అవగాహన మరియు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్ ఏ ఆర్ ఎస్) శాస్త్రవేత్త డాక్టర్ సందీప్ నాయక్ హాజరై, రైతులకు కుసుమ పంట సాగుపై విలువైన సూచనలు అందించారు.ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ, కుసుమ విత్తనం విత్తినప్పటి నుండి పంట కోత వరకు క్రమం తప్పకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. ప్రతి 30 రోజులకు ఒకసారి పంట పొలాలను సందర్శించి తగిన సలహాలు అందిస్తామని తెలిపారు.అలాగే, ఎంపిక చేసిన రైతులకు 100% సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం లో మండల వ్యవసాయ అధికారి పి. శివరామ ప్రసాద్, గ్రామ ఉద్యానవన అధికారిణి సంధ్య, పెసా కమిటీ ఉపాధ్యక్షులు పొడుగు మోహనరావు, పెసా కార్యదర్శి కొర్రలు బంగారయ్య, మాజీ సర్పంచ్ లు కొడా చిన్నతల్లి, రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

## విజయదశమి సందర్భంగా

# ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

**విజయనగరం (జయ జయహే)**



విజయదశమి పండగ సందర్భంగా విజయనగరం జిల్లా ప్రయాణికులకు ఏ పి ఎస్ ఆర్ టి సి ప్రత్యేకంగా బస్సులను ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి జి.వర లక్ష్మి తెలియజేసితిరి. విశాఖపట్నం, సింహాచలం, అనకాపల్లి, శ్రీకాకులం, చీపురపల్లి, పాలకొండ, సాలూరు, పార్వతీపురం, ఎస్.కోట రూట్లలో 100 బస్సులు తిరుగుచున్నవి. మొదటి రోజు అనగా ఆదివారం తేది: 18.10.2026న అధనంగా స్పెషల్స్ 10 బస్సులు, అలాగే రెండ వ రోజు సోమవారం తేది: 19.10.2026న రోజు స్పెషల్స్ 15 బస్సులను త్రిప్పుటకు ఏర్పాటు చేయుచున్నాము.అలాగే భక్తులకు ఎటువంటి ఇబ్బంది జరగకుండా 05 మంది కానిస్టేబుల్స్ మరియు సూపర్వైజర్లు ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు.దూర ప్రాంత సర్వీసులు కూడా పెంచినట్లు తెలియజేశారు. భక్తులు ఆర్ టి సి బస్సులను వినియోగించుకోవాలని సూచించారు.

## బిసిలకు 34 శాతం ప్రాతినిధ్యం

### మాట నిలబెట్టుకుంటాం.. బిసి లకు న్యాయం చేస్తాం

**రాజమహేంద్రవరం: జయ జయహే**



అక్టోబర్ 9:బిసిలరాజకీయ, సామాజిక అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు స్పష్టం చేశారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 34 శాతం ప్రాతినిధ్యం కల్పించేందుకు కృషి చేస్తామన్నారు.టిడిపి ప్రభుత్వ హయాంలో బిసి ల రాజకీయ ప్రాతినిధ్యం కోసం 1987లో 20 శాతం, 1995లో 34 శాతం రిజర్వేషన్లు కల్పించినట్లు తెలిపారు. ఇటీవల 34 శాతం రిజర్వేషన్ల అమలుకు కూటమి ప్రభుత్వం జీవోలు జారీ చేసినప్పటికీ, వైసిపి నేతలు న్యాయస్థానాలను ఆశ్రయించడంతో అడ్డంకులు ఏర్పడ్డాయని ఆరోపించారు. అధికారంలో ఉన్నప్పుడు బిసి లకు అన్యాయం చేసి, ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు.సుప్రీంకోర్టు తీర్పును గౌరవిస్తూ, చట్టపరమైన పరిమితులకు అనుగుణంగా బిసి లకు రాజకీయ న్యాయం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బిసి లను కేవలం ఓటు బ్యాంకుగా చూడకుండా, వారి రాజకీయ, సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని సత్తిబాబు తెలిపారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో కుటుంబంలో ఒక్క విద్యార్థికే ఫీజు రీయింబర్స్‌మెంట్ పరిమితమయ్యేదని, ప్రస్తుతం కుటుంబంలోని పిల్లలందరికీ విద్యా అవకాశాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని, మహిళలకు శ్రీశక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు.బిసి లను రాజకీయంగా ప్రోత్సహించడంలో టీడీపీ కీలక పాత్ర పోషించిందని పేర్కొంటూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపేందుకు బిసి లు సిద్ధంగా ఉన్నారని సత్తిబాబు వెల్లడించారు.



## గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం

### ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

### వాలాబు పంచాయతీలో 7 కోట్ల 96 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**దేవరాపల్లి, అక్టోబర్ 9, జయ జయహే :**

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత కల్పిస్తుందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మండలంలోని వాలాబు పంచాయతీ పరిధిలో 7 కోట్ల 76 లక్షల రూపాయలతో చేపట్టనున్న రహదారి నిర్మాణ పనులకు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, స్థానిక కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఏపీఆర్ఆర్ఎస్పీ నిధులు 6 కోట్ల 31 లక్షల రూపాయలతో పినకోట ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి వాలాబు మీదుగా కోణం వరకు తారు రోడ్డు నిర్మించనున్నామని, పల్లె పండుగ 3.0లో భాగంగా వీబీ-జీ రామ్ జీ నిధులు కోటి 45 లక్షల రూపాయలతో వాలాబు నుంచి కె.టి.పాలెం వరకు మూడు సీసీ రోడ్లు నిర్మించనున్నామని తెలిపారు. అనంతరం వాలాబు మాజీ సర్పంచ్ పోడెల వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వాలాబు పంచాయతీ పరిధిలో గత రెండేళ్ల నాలుగు నెలల్లో 18 కోట్ల 34 లక్షల రూపాయల అభివృద్ధి నిధులు వెచ్చించినట్లు చెప్పారు.ఇందులో ఉపాధి హామీ పథకం ద్వారా 10 కోట్ల 78 లక్షల రూపాయలు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. వడ్డాది జంక్షన్ నుంచి చింతలపూడి, వాలాబు, కోణం మీదుగా మాడుగుల--పాడేరు ప్రధాన రహదారికి అనుసంధానం కల్పించనున్నట్లు తెలిపారు.పల్లె పండుగ 4.0 నాటికి వాలాబు పంచాయతీలో మిగిలిన రెండు అంతర్గత రహదారుల పనులు పూర్తి చేస్తామని పేర్కొన్నారు.జలజీవన్ మిషన్ కింద తాగునీటి పనులను పునరుద్ధరిస్తున్నామని, 121 కోట్ల రూపాయల విలువైన పనులు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. మరో 410 కోట్ల రూపాయల పనులకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. గిరిజన ప్రాంతాల్లో కాఫీ రైతులకు గిట్టుబాటు ధర, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేందుకు ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు.స్థానిక గిరిజనులను ఎస్టీ జాబితాలో చేర్చే అంశంపై కేంద్ర మంత్రి జువల్ ఓరం సానుకూలంగా స్పందించారని, ఈ అంశానికి సంబంధించిన ఫైలు పరిశీలనలో ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పెదనందిపల్లిలో 50 లక్షలతో చేపట్టిన సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అంతకుముందు చింతలపూడిలో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు పెద్దాడ వెంకటరమణ, రైవాడ జలాశయ చైర్మన్ పోతల పాత్రునాయుడు, టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, సీనియర్ నాయకులు రావాడ సింహాద్రి నాయుడు, చల్లా నానాజీ, చామంతుల వెంకన్న దొర, గర్రెడ్డి కొండలరావు (జికె), చిటిమిరెడ్డి నాయుడు, కొరుపోలు రామలింగ స్వామి, ఆవుగడ్డ కోటిపల్లి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత టీడీపీదే

### బీసీల అభ్యున్నతికి ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు వరకు ప్రత్యేక కృషి

### టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య

**గార్లదిన్నె ,(జయ జయహే )**



బీసీలకు రాజకీయంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు, వారి అభ్యున్నతికి తెలుగుదేశం పార్టీ మొదటి నుంచి ప్రత్యేక కృషి చేస్తోందని అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు ఆవుల కృష్ణయ్య పేర్కొన్నారు. శుక్రవారం ఈ సందర్భంగా అనంతపురం బీసీ సెల్ పార్లమెంట్ అధ్యక్షులు కృష్ణయ్య మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు టీడీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలు చారిత్రాత్మకమని ఆయన వివరించారు.

**బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యంలో కీలక మార్పులు**

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి బీసీల అభ్యున్నతికి ప్రాధాన్యత ఇస్తోందని ఆవుల కృష్ణయ్య తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రాజకీయ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రిజర్వేషన్ల విధానాన్ని బలోపేతం చేసిందన్నారు. 1987లో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించగా, 1995లో వాటిని 34 శాతానికి పెంచిన ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు.

**బీసీలకు అండగా టీడీపీ**

బీసీలు రాజకీయంగా, సామాజికంగా ఎదగాలంటే స్థానిక సంస్థల్లో తగిన ప్రాతినిధ్యం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీల్లో బీసీలకు ప్రాతినిధ్యం లభించడం ద్వారా వారి సమస్యలను ప్రజాప్రతినిధులు నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఏర్పడుతుందన్నారు.

**రిజర్వేషన్ల అమలుపై విమర్శలు**

బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేసే విషయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆశించిన స్థాయిలో చర్యలు తీసుకోలేదని ఆవుల కృష్ణయ్య విమర్శించారు. రిజర్వేషన్ల అంశంలో న్యాయపరమైన అడ్డంకులు ఏర్పడటంతో బీసీలు రాజకీయ అవకాశాలు కోల్పోయారని పేర్కొన్నారు. సుమారు 16,800 మంది బీసీలు రాజకీయ ప్రాతినిధ్యానికి దూరమయ్యారని తెలిపారు.

**బీసీల అభ్యున్నతే లక్ష్యం**

బీసీలకు విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఆవుల కృష్ణయ్య అన్నారు. బీసీ వర్గాల హక్కుల పరిరక్షణకు, వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి టీడీపీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## బొండాడ వెంకట గోపాలకృష్ణమూర్తి ఇక లేరు

**భీమవరం ; (జయ జయహే)**



భీమవరంలో గత 100 సంవత్సరము నుంచి బట్టల వ్యాపారం చేయుచున్న బొండాడ సిల్క్, తరుణి అధినేత బొండాడ వెంకట గోపాలకృష్ణమూర్తి (గోపాలం) (91) శుక్రవారం మృతి చెందారు. బొండాడ గోపాలం మితభాషి, మృదుభాషి, శ్రీరామ భక్తులు, వారి పవిత్ర ఆత్మకు పరిపూర్ణానమైన శాంతిని ప్రసాదించాలని శ్రీసద్గుతు దేవులను ప్రార్థిస్తున్నామని పట్టణ ప్రముఖులు ప్రగడ సానుభూతిని తెలియజేశారు. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కలరు.వారి కుటుంబ సభ్యులను పలువురు పరామర్శించారు.

# హెల్మెట్ ధరిస్తేనే.. సురక్షిత ప్రయాణం!

### రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ

**రాజమహేంద్రవరం: జయ జయహే : అక్టోబర్ 9:**






రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి యార్లగడ్డ శ్రీలక్ష్మి సూచించారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని జిల్లా రవాణా కార్యాలయం ఆధ్వర్యంలో మోటారు వాహనాల చట్టం, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం హెల్మెట్ వినియోగంపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు నిర్వహించిన బైక్ ర్యాలీని యార్లగడ్డ శ్రీలక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగించడం ప్రాణాపాయానికి దారితీస్తాయని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాల తీవ్రతను తగ్గించడంతోపాటు విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. రహదారిపై ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, రోడ్డు భద్రతను సామాజిక బాధ్యతగా గుర్తించాలని పిలుపునిచ్చారు.జిల్లా రవాణా కార్యాలయం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ ఏవీ అప్పారావు రోడ్డు మీదుగా జాతీయ రహదారిపై కొనసాగి తిరిగి రవాణా కార్యాలయానికి చేరుకుంది. వందకు పైగా ద్విచక్ర వాహనాలతో నిర్వహించిన ఈ ర్యాలీలో లీగల్ డిఫెన్స్ కౌన్సెల్స్, పారా లీగల్ వాలంటీర్లు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జిల్లా రవాణా అధికారి ఆర్. సురేష్ కుమార్, రవాణా శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# భారతీయ సంస్కృతి అంటేనే వేద సంస్కృతి

**కర్నూలు (జయ జయహే)**

భారతీయ సంస్కృతి అంటేనే వేద సంస్కృతి అని, వేదం అంటే కేవలం ఒక మత గ్రంథం కాదని, ఈ దేశ జీవన విధానానికి, విజ్ఞానానికి, విలువలకు మూలమైన దానని అందరూ తెలుసుకోవాలని ఆధ్యాత్మిక ప్రవచకులం వైష్ణవ రామశేషయ్య అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో బనగానపల్లె పట్టణంలోని చింతమాను మఠం ( శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మఠం ) నందు గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజులపాటు స్థానిక భజన మండలిచే నిర్వహించిన భజనలు, ధార్మిక ప్రవచకులు వైష్ణవ రామసేషయ్య చేసిన ప్రవచనాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాల గురించి, తిరుమల తిరుపతి దేవస్థానములు నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మఠం కార్యనిర్వహణాధికారి బ్రహ్మానంద రెడ్డి, అర్చకులు చిరంజీవాచార్యులు, మఠం మేనేజర్ మహేశ్వర్ రెడ్డి, కోశాధికారి రంగస్వామి, భజన మండలి సధ్యక్షులు బి.నాగమల్లారెడ్డి, అల్లె శివరామి రెడ్డి, రామలింగారెడ్డి, భజన కృష్ణయ్య, తీర్థంరెడ్డి, కృష్ణారెడ్డి, పెద్ద శంకరన్న, చిన్న శంకరన్న, బుర్రకథ కళాకారుడు జమ్మయ్య, శ్రీను, యాదగిరి, సుబ్బకిట్టుతో పాటు మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కొణతాల అనకాపల్లి

**జయ జయహే**

అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీ పరిధిలో విఎమ్ అర్ డి ఏ నిధులు తో సుమారు 8.36 కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న పార్కు అలాగే బి.ఆర్.టి కాలనీలో సుమారు 4.46 కోట్ల రూపాయలతో నిర్మాణంలో ఉన్న నూతన కళ్యాణ మండపం అభివృద్ధి పనులను మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ శుక్రవారం పరిశీలించడం జరిగింది ఈ సందర్భంగా పార్కు కళ్యాణ్ మండపం నిర్మాణ పనుల పురోగతిని ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు పనులు నాణ్యత ప్రమాణాలతో నిర్దేశిత గడువుల పూర్తి చేయాలని అధికారులకు సూచించారు ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా మౌలిక వసతులు సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అభివృద్ధి పనుల్లో ఎటువంటి జాప్యం లేకుండా వేగవంతం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే రామకృష్ణ కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు




# న్యూయార్క్ వేదికగా ఆదివాసీ గొంతుక..!

## ప్రపంచ వేదికపై ఆదివాసీ హక్కుల కోసం అరకు ఎంపీ డా. గుమ్మ తనూజారాణి గళం

**ముంచంగిపుట్టు, జయ జయహే :**

ఆదివాసీ గిరిజన సమాజాల అభివృద్ధి, హక్కులు, సంక్షేమం పట్ల ఉన్న ఆవశ్యకతను ప్రపంచ వేదికపై చాటిచెప్పిన అరకు పార్లమెంట్ సభ్యురాలు డా. గుమ్మ తనూజారాణి ఆదివాసీ సమాజాల ఆకాంక్షలకు అంతర్జాతీయ స్థాయిలో ప్రాధాన్యత కల్పించే దిశగా తన గళాన్ని వినిపించారు.




"ఆదివాసీ గిరిజన సమాజాలు అభివృద్ధి చెందితేనే భారతదేశం నిజమైన అభివృద్ధిని సాధించినట్లవుతుంది" అనే సందేశం ఆదివాసీ అభ్యున్నతి ప్రాముఖ్యతను తెలియజేస్తోంది.

ఆదివాసీలకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సదుపాయాలు, ఉపాధి అవకాశాలు, సమాన హక్కులు, గౌరవప్రదమైన జీవనం కల్పించడంతో పాటు వారి ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించాల్సిన అవసరం ఉందని ఈ సందేశం స్పష్టం చేస్తోంది.

ఆదివాసీ అభివృద్ధి అనేది కేవలం ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితమైన అంశం కాదు. సమానత్వం, సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధికి అది కీలకమైన పునాది. ఆదివాసీ సమాజాల సమస్యలు, ఆకాంక్షలు, హక్కులు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందేలా ప్రజాప్రతినిధుల కృషి ఎంతో అవసరం.అరకు గిరిజన ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీ డా. గుమ్మ తనూజారాణి స్వరం ఆదివాసీ సమాజాల అభివృద్ధి ఆవశ్యకతను మరోసారి గుర్తుచేస్తోంది. ఆదివాసీల హక్కులు, సంక్షేమం, సంస్కృతి పరిరక్షణకు ప్రాధాన్యత కల్పించే ఇలాంటి ప్రయత్నాలు సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి దోహదపడతాయని ఎంపీ పేర్కొన్నారు. ఎంపీ తనుజారానికి అభినందనలుఅంతర్జాతీయ వేదికపై ఆదివాసీ గిరిజనుల సమస్యలను, వారి హక్కులను ప్రపంచం దృష్టికి తీసుకెళ్లిన తనుజారాణ్ణికి ఆదివాసీలు అభినందిస్తున్నారు. ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం ఎంపీ తనుజారాణి చేస్తున్న కృషి ఎంతో అభినందనీయమని పలువురు పేర్కొంటున్నారు.



# షైనింగ్ స్టార్స్ ప్లే స్కూల్లో ఘనంగా దసరా వేడుకలు

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**

నిడదవోలు పట్టణంలోని షైనింగ్ స్టార్స్ ప్లే స్కూల్లో దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు సంప్రదాయ దుస్తులు ధరించి, పండుగ ఉత్సాహంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు చిన్నారులకు దసరా పండుగ విశిష్టతను వివరించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి దసరా ప్రతీక అని, ప్రతి ఒక్కరూ ధైర్యం, సాహసం, మంచితనాన్ని అలవర్చుకుని మంచి మార్గంలో నడవాలని సూచించారు. పండుగల ద్వారా చిన్నారుల్లో నైతిక విలువలు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పువ్వల రతీదేవి, ఉపాధ్యాయులు ఎం. జ్యోతి, స్రవంతి, స్వాతి, యామిని పాల్గొన్నారు.




# ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

## పరిసరాలు పరిశుభ్రత పాటించాలి

## ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి: డాక్టర్ కందుల నాగరాజు

**విశాఖపట్నం (జయ జయహే)**

మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం చైర్మన్, దక్షిణ నియోజకవర్గం జనసేన నాయకులు డాక్టర్ కందుల నాగరాజు అన్నారు. దోమల ద్వారా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతి శుక్రవారం డ్రై డే ఫ్రైడే కార్యక్రమం 32 వ వార్డులో చలువతోట ప్రాంతంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చలువుతోట, ఏడుగుళ్ళు, నేరేళ్ల కోనేరు ప్రాంతంలో అధికారులతో కలిసి పర్యటించి పరిసరాలు పరిశుభ్రత పైన ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ముఖ్య అతిథి డాక్టర్ కందుల నాగరాజు మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండకుండా నిర్లక్ష్యం వహిస్తే ప్రమాదకర వ్యాధుల బారిన పడతామని చెప్పారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రతను పాటించాలని పేర్కొన్నారు. మన పరిసరాలలో ఎక్కడకక్కడ చెత్తను పడేయడం, ముఖ్యంగా ప్లాస్టిక్ను కాలువలలో వేస్తూ ఉండటం, ఈ కారణంగా చెత్త పేరుకుపోవడం, మురుగునీరు వెళ్లకపోవడం, దోమలు వృద్ధి చెంది ఆయా వ్యాధులకు కారణం అవుతున్నాయని తెలిపారు. ఈ కారణంగా మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వ్యాధులు ఎక్కువగా ప్రబలుతున్నాయని వెల్లడించారు. పలుమార్లు అధికారులు అలాగే వైద్య సిబ్బంది ప్రజలకు దీనిపై అవగాహన కల్పిస్తూ ఉన్నప్పటికీ కూడా వారిలో మార్పు రాకపోవడం విచాకరమని అన్నారు. ఇప్పటికైన ప్రజలు తమ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని చెప్పారు. నీళ్లు ఉన్న బకెట్లు, బిందెలు, డ్రమ్ములపై తప్పనిసరిగా మూతలు వేసి ఉంచాలని తెలియజేశారు. లేనియెడల అక్కడ దోమలు గుడ్లు పెడతాయని, తద్వారా దోమల వ్యాప్తి ఎక్కువగా జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని తెలిపారు. వినియోగించిన ప్లాస్టిక్ వ్యర్థాలను కాలువల్లో అలాగే ఎక్కడికక్కడ పడేయకుండా ఉండాలని, నిర్దేశించిన చెత్తకుండీలలో మాత్రమే వాటిని పడేయాలని సూచించారు. అధికారులకు ప్రజలు పూర్తిగా సహకరించాలని తెలిపారు.

# ప్రేక్షకులను తన సినిమాలతో 'అదుర్స్' అనిపించిన డైరెక్టర్ వినాయక్

**భీమవరం ; (జయ జయహే )**

మాస్, యాక్షన్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్ గా నిలిచిన విజయవంతమైన దర్శకులు వివి వినాయక్ అని అఖిల భారత శోభన్ బాబు సేవా సమితి కన్వీనర్ భట్టిప్రోలు శ్రీనివాసరావు అన్నారు. దర్శకులు వివి వినాయక్ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ వారితో గడిపిన మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ప్రేక్షకులను తన సినిమాలతో 'అదుర్స్' అనిపించిన డైరెక్టర్ వినాయక్ అని కొనియాడారు. వారు మరెన్నో పుట్టినరోజు వేడుకలను జరుపుకోవాలని, మరెన్నో విజయవంతమైన చిత్రాలను దర్శకత్వం వహించాలని కోరుకుంటున్నామని అన్నారు.





# సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు పరిశీలన

**దేవరాపల్లి, అక్టోబర్ 9, జయ జయహే :**

మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎస్ఐ వి.సత్యనారాయణ శుక్రవారం సందర్శించారు. రైవాడ, దేవరాపల్లి, ఏ.కొత్తపల్లి, ఎం.అలమండ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, అక్కడి పరిస్థితులను సమీక్షించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి స్ట్రాంగ్ రూమ్‌ను ఎంపీడీవో ఎస్. కిరణ్ వరప్రసాద్ సమక్షంలో డిప్యూటీ తహశీల్దార్ కె.అప్పారావు, ఎంఈఓ- 1 వి.వి.ఈశ్వరరావు, ఏవో డి.వి.లక్ష్మీనారాయణ తదితరులు తనిఖీ చేశారు.



# ఓట్ల దొంగతనాన్ని అరికట్టాలి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

**అనకాపల్లి జయ జయహే**

దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను పరిరక్షించాలని ఎన్నికల ప్రక్రియల అక్రమాలకు దావులేకుండా పారదర్శకంగా ఎన్నికల నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ పిడిఎస్ఓ ఆధ్వర్యంలో అనకాపల్లి నెహ్రూ కూడలి వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు ఓట్లు చోరీ వంటి ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలను అరికట్టాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఎస్ఎఫ్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బి బాబ్జి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని ప్రజలు తమ ఓటు ద్వారా ఎన్నుకున్న ప్రభుత్వాలే ప్రజలు జవాబుజారిగా ఉండాలని వారి పేర్కొన్నారు ఎన్నికల ప్రక్రియ పై ప్రజలకు నమ్మకం కలిగించేలా ఎన్నికల సంఘం వ్యవహరించాలని కోట్ల చోరీకి సంబంధించిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవం ప్రజల ముందు ఉంచాలని వారు డిమాండ్ చేశారు ప్రజాస్వామ్య విలువలను కాపాడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎన్నికల వ్యవస్థల పారదర్శకతను నిర్ధారించాలని వారు కోరారు పిడిఎస్ఓ జిల్లా కార్యదర్శి రుద్రి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు అత్యంత ప్రాధాన్యత ఉన్నదని దాని పారదర్శకత చూపడంలో ఎన్నికల సంఘం కట్టుబడి ఉండాలని ఎన్నికల ప్రక్రియ పై ప్రజల అనుమానాలు తలెత్తకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు ఓటు హక్కును కాపాడుకున్న ప్రతి పౌరుడు బాధ్యత అని ప్రజాస్వామ్యాన్ని బలహీన పరిచయ చర్యలకు వ్యతిరేకంగా వ్యతిరేకంగా విద్యార్థులు యువత చైతన్యవంతమై ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు ప్రజల ఓటు హక్కుకు భంగం కలగకుండా ఎన్నికల వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్యంగా ఓటు హక్కు రక్షణ కోసం తమ పోరాటాన్ని కొనసాగిస్తామని నాయకులు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి జగదీష్ తదితరులు పాల్గొన్నారు

# మత్తు మాయలో పడొద్దు లక్ష్యాన్ని వీడొద్దు!

## విద్యార్థులకు డ్రగ్స్ నివారణ, రోడ్డు భద్రతపై పోలీసుల అవగాహన

**రాజమహేంద్రవరం, జయ జయహే, అక్టోబర్ 9:**

విద్యార్థి దశలోనే చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, లక్ష్యసాధనతో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని తూర్పుగోదావరి జిల్లా పోలీసులు పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు సౌత్ జోన్ ఈగల్ టీమ్, రాజమహేంద్రవరం టూటౌన్ పోలీసుల ఆధ్వర్యంలో టి.నగర్‌లోని సెయింట్ పాల్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో సుమారు 160 మంది విద్యార్థులకు డ్రగ్స్ నివారణ, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టూటౌన్ సీఐ పి. శివగణేష్ మాట్లాడుతూ, మత్తు పదార్థాలకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. విద్యార్థి దశ జీవితానికి పునాది అని, ఈ సమయంలో తీసుకునే నిర్ణయాలే భవిష్యత్తును నిర్దేశిస్తాయని పేర్కొన్నారు. సోషల్ మీడియాను విజ్ఞానం, అభివృద్ధికి ఉపయోగించుకోవాలని, అపరిచితులతో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, ఫోన్ నంబర్లు పంచుకోవడంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలు నడిపేటప్పుడు మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ, వేధింపులు లేదా అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని, చట్టవిరుద్ధ కార్యకలాపాలపై సమాచారం అందించాలని విద్యార్థులకు వివరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీ పౌలీ మోర్లీ, సౌత్ జోన్ ఈగల్ టీమ్ హెడ్ కానిస్టేబుల్ జి. వెంకటరావు, పోలీస్ కానిస్టేబుళ్లు వి. రామ్‌కుమార్, సురేష్ పాల్గొన్నారు.



# చెదిరిన మనసుకు చేయూతనిద్దాం...!

## ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం అక్టోబర్ 10 సందర్భంగా ప్రత్యేక శీర్షిక....

ప్రతి ఏటా అక్టోబర్ 10వ తేదీన ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని జరుపుకుంటాం. శారీరక ఆరోగ్యం ఎంత ముఖ్యమో మానసిక ఆరోగ్యం అంతకన్నా రెట్టింపు ముఖ్యమని తెలుసుకోవాలి. మనిషి ఎన్నో రకాల భావోద్వేగాల మధ్య తన యొక్క జీవనాన్ని గడుపుతూ ఉంటాడు. ప్రస్తుత సమాజంలో అధిక ఒత్తిడితో కూడుకున్న పని భారమైన ఉద్యోగాలతో ఎన్నో విధాలుగా తీవ్రమైన అలసటకు లోనై మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కష్టంగా మారింది. సంపదలో ఉన్న మోజు మానసిక ఆరోగ్య రక్షణలో లేదు. రేయింబవళ్లు పనిచేసే అధిక ఒత్తిడితో కూడుకున్న ఉద్యోగాలలో నిద్రలేమి ఆహారం అర్ధరాత్రి దాటిన సమయంలో తీసుకోవడం వలన వివిధ కారణాల వలన మానసికంగా బలహీనంగా మారి మానసిక వ్యాదిగ్రస్తులు అవుతున్నారు. జీవన గమనంలో అలవాట్లు ఆలోచనలు మంచిగా ఉంటే మన శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం వంతులము అవుతాము.

**మానసిక ఆరోగ్యం**

నిత్య జీవనంలో మానవులు అందరూ అనేక రకాలైన విధంగా ఉంటారు. నడవడిక ఆలోచన విధానం పై వివిధ రకాలైన పరిస్థితులు ప్రభావం చూపుతూ ఉంటాయి . ఆలోచనలు, భావనలు ప్రవర్తన సరిగా ఉండటం, కష్టాలను ఎదుర్కోగలడం, సంతోషంగా పనిచేయడం సమాజానికి ఉపయోగపడడమే మానసిక ఆరోగ్యం. మానసిక ఆరోగ్యం దెబ్బతింటే నిలకడ లేని ఆలోచనలు కలుగుతాయి అందుకని దీనిని పరిరక్షించుకునే విధంగా ఉండాలి.

**మానసిక సమస్యలకు ప్రధాన కారణాలు**

1. అధిక ఒత్తిడి విపరీతమైన ఆలోచనలు.
2. కుటుంబ కలహాలు ఒంటరితనం. 3. సోషల్ మీడియా ప్రభావం.
4. నిద్రలేమి.
5. అనారోగ్యకర జీవనశైలి.

**మానసిక ఆరోగ్య దినోత్సవం ఎందుకు జరుపుకోవాలి**

నేడు ప్రపంచంలో ప్రతి ఎనిమిది మందిలో ఒకరు మానసిక అనారోగ్యంతో సమస్యతో బాధపడుతున్నారు. ముఖ్యంగా యువతలో ఆత్మహత్యలు జరుగుతున్నాయి. ఈ రకమైన ధోరణికి ముఖ్య కారణం వారి యొక్క మానసిక స్థితి బాగు లేకపోవడమే. దీనికి కౌన్సిలింగ్ మరియు వైద్యం చాలా వరకు అవసరం. వారికి తగిన విధంగా తోడ్పాటు చాలా అవసరం. ఇటువంటి విధానంలో ఈ మానసిక ఆరోగ్య అవగాహన దినోత్సవాన్ని జరుపుకోవాలి.




**మానసిక ఆరోగ్యం - పరిరక్షణ**

సమాజంలో ఆర్థిక అసమానతలు ఇతర సమస్యలు కారణంగా జీవి చాలా సతమతమై ఒడిదుడుకులకు లోనయ్యి ఇబ్బంది పడుతూ కాలం గడుపుతున్నాడు

నాడీ వ్యవస్థ పైన భారం పెట్టి అనేక ఆలోచనలు విపరీతమైన భావోద్వేగాలకు లోనై సరైన జీవనాన్ని గడపలేకపోతున్నాడు. అందుకని కౌన్సిలింగ్ అనే ప్రక్రియ చాలా వరకు అవసరం అవుతూ ఉంటుంది.

1. ఎంత సంపాదించినా ఏదో వెలితి ఉండకూడదు.
2. సంతృప్తి చెందే విధంగా జీవనాన్ని మలచుకోవాలి.
3. అన్నింటికీ మించి మితిమీరిన కోరికలు వలన మానసిక ఘర్షణకులోనే తీవ్రమైన మనోవేదనకు గురి అవ్వకుండా కోర్కెలను అదుపులో ఉంచుకోవాలి.
4. ఎక్కువ సమయం ఖాళీగా ఉండకూడదు. మనదైన స్థాయిలో ఏదో ఒక పనిని తగిన విధంగా చేయడం ఉత్తమం.
5. ఏది అవసరం ఏది అనవసరం అనే ఆలోచన చేసి అడుగులు వేయాలి.
6. మెదడు మనసు చెప్పినవన్నీ చేసే ప్రయత్నం ఎప్పుడూ చేయకూడదు. మనకి అవసరం అనిపిస్తేనే చేయాలి.
7. అధిక కోరికలు వలన ధనము చాలా అవసరం అవుతుంది అని అపోహలకు గురి అయ్యి ఋణాన్ని చేయడం అది తీర్చలేక సతమతం అవ్వడం అనేది జరుగుకుండా ముందుగా కోరికలను అదుపులో పెట్టుకోవడం ఉత్తమమైన ప్రక్రియ. 8. ఆలోచనలు అధిక స్థాయిలో ఉండకూడదు. అలా ఉంటే మెదడు సక్రమంగా పనిచేయదు.
9. మనసు చాలా వేగమైనది దానిని ఎప్పుడూ అదుపులో ఉంచుకునే ప్రయత్నం చేయాలి.
10. తల్లిదండ్రులు ఎల్లవేళలా పిల్లల్ని వారి యొక్క ఆలోచనలను గ్రహించి వారికి సరైన విధంగా మానసిక తోడ్పాటును కలిగిస్తే ఆత్మహత్య అన్న ఆలోచన వారిలో కలుగదు.

రచన..
ఏ బాల సౌజన్యకుమారి,
తెలుగు ఆచార్యులు,
నంది అవార్డు గ్రహీత,
ఆధ్యాత్మికవేత్త, ప్రవచనకర్త.




## శాస్త్రీయ పద్ధతుల్లో చెత్త నిర్వహణతో గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయం : ఎంపీడీఓ కె. ధర్మారావు

**ముంచంగిపుట్టు, జయ జయహే :**

గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను శాస్త్రీయ పద్ధతుల్లో చేపట్టి, వ్యర్థాల నుంచి సంపద సృష్టించే విధానాలపై అవగాహన కల్పించేందుకు ఈరోజు బంగారుమెట్టలో ఎక్స్‌పోజర్ విజిట్ నిర్వహించారు. ఎంపీడీఓ కె. ధర్మారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి, వాటిని ఆదాయ వనరులుగా మార్చే విధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కె. ధర్మారావు మాట్లాడుతూ, ప్రతి ఇంటి నుంచి తడి చెత్తను క్లాప్ మిత్రుల ద్వారా ప్రతిరోజూ సేకరించి, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల్లో వానపాముల సహాయంతో సేంద్రియ ఎరువులను తయారు చేయాలని సూచించారు. తయారైన ఎరువులను రైతులకు విక్రయించడం ద్వారా గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని వివరించారు. అదేవిధంగా, ప్రతి ఇంటి గోడకు ఒక గొనె సంచిని ఏర్పాటు చేసుకుని, రోజువారీగా వెలువడే పొడి చెత్తను అందులో వేయాలని గృహ యజమానులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ విధంగా సేకరించిన పొడి చెత్తను గ్రామానికి వచ్చే స్వచ్ఛ రథానికి విక్రయించడం ద్వారా వచ్చే ఆదాయంతో గృహావసరాలకు అవసరమైన నిత్యావసర సరుకులను పొందే అవకాశం ఉంటుందని తెలియజేయాలని పేర్కొన్నారు. గ్రామాల్లో పరిశుభ్రతను కాపాడటంతో పాటు వ్యర్థాలను సమర్థవంతంగా వినియోగించి, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని ఈ కార్యక్రమంలో వివరించారు. చెత్తను సక్రమంగా వేరు చేసి సేకరించడం ద్వారా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు గ్రామ పంచాయతీల ఆదాయాన్ని పెంపొందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ కె. ధర్మారావుతో పాటు పంచాయతీ అభివృద్ధి అధికారులు, వివిధ గ్రామ పంచాయతీలకు చెందిన క్లాప్ మిత్రులు పాల్గొన్నారు.

## బీసీలకు 34 శాతం మించి సీట్లు బాబు ఇస్తామనడం అభినందనీయం

### ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు

**విశాఖపట్నం, అక్టోబర్ 9, జయ జయహే**




స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతానికి మించి సీట్లు కేటాయిస్తామని తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించడం అభినందనీయమని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీలకు రాజకీయంగా తగిన ప్రాధాన్యం కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. బీసీలకు రావాల్సిన రిజర్వేషన్ల విషయంలో వైసీపీ నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించి అడ్డంకులు సృష్టిస్తున్నారని రెడ్డి నారాయణరావు విమర్శించారు. టీడీపీకి బీసీలు వెన్నెముకగా నిలుస్తున్నారని, బీసీల అభ్యున్నతికి ఆ పార్టీ మొదటి నుంచి కృషి చేస్తోందని తెలిపారు. 1987లో ఎన్టీ రామారావు హయాంలో బీసీలకు తొలిసారిగా 20 శాతం రిజర్వేషన్లు కల్పించగా, 1995లో చంద్రబాబునాయుడు వాటిని 34 శాతానికి పెంచారని గుర్తుచేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బీసీల రిజర్వేషన్లపై అధ్యయనం చేసేందుకు కనీసం కమిషన్ కూడా ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగకపోవడంతో 23 మున్సిపాలిటీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు అందలేదని పేర్కొంటూ, రాష్ట్రవ్యాప్తంగా అలాంటి పరిస్థితి పునరావృతం కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఎన్నికల నిర్వహణకు చర్యలు చేపట్టారని తెలిపారు. బలహీన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు వారి ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని రెడ్డి నారాయణరావు పేర్కొన్నారు. బీసీలకు 34 శాతానికి మించి సీట్లు కేటాయిస్తామన్న ప్రకటనను స్వాగతిస్తున్నట్లు తెలిపారు.



## మండల విద్యాశాఖాధికారి-2గా గొల్లోరి సూర్యనారాయణ బాధ్యతల స్వీకరణ

**ముంచంగిపుట్టు, జయ జయహే :**

మండల విద్యాశాఖాధికారి--2గా గొల్లోరి సూర్యనారాయణ అదనపు బాధ్యతలను శుక్రవారం స్వీకరించారు. గతంలో మండల విద్యాశాఖాధికారి--2గా విధులు నిర్వహించిన బీహెచ్‌వీఎస్ త్రినాథరావు పదవీ విరమణ చేయడంతో ఈ పోస్టు ఖాళీ ఏర్పడింది. గత రెండు నెలలుగా ఈ పోస్టు ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో ప్రాంతీయ సంయుక్త సంచాలకుల ఆదేశాల మేరకు బంగారుపుట్టు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న గొల్లోరి సూర్యనారాయణను మండల విద్యాశాఖాధికారి--2గా అదనపు బాధ్యతలు నిర్వహించేందుకు నియమించారు. ఈ మేరకు ఆయన ఈ రోజు మండల విద్యాశాఖాధికారి--2గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని పాఠశాలల అభివృద్ధికి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు, ఉపాధ్యాయుల సహకారంతో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణమూర్తి, వివిధ ఉపాధ్యాయ సంఘ నాయకులు, మండల విద్యాశాఖ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## తిరుపతి పార్లమెంట్ సమన్వయకర్తగా బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తా

### పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

### జనసేన పార్టీ అధినేతకు కృతజ్ఞతలు తెలిపిన తిరుపతి పార్లమెంట్ సమన్వయకర్త

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 09, జయ జయహే**

శ్రీకాళహస్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జనసేన పార్టీ సంస్థాగత బలోపేతానికి పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక అడ్‌హాక్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో తిరుపతి పార్లమెంట్ సమన్వయకర్తగా తనకు కీలక బాధ్యతలు అప్పగించిన పవన్ కళ్యాణ్‌కు సదరు సమన్వయకర్త హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధినేత తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ, ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని, ప్రజల పక్షాన జనసేన పార్టీ గొంతుకను మరింత బలంగా వినిపిస్తానని తెలిపారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా స్థానిక నాయకులు, జనసైనికులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరినీ సమన్వయం చేసుకుంటూ అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు.




## మధ్యవర్తిత్వంతో వివాదాలకు సత్వర పరిష్కారం

### ఎనిమిదో అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి ఎస్. కవిత

**అగనంపూడి, అక్టోబర్ 9, జయ జయహే:**

మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎనిమిదో అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి ఎస్. కవిత అన్నారు. చిన్నచిన్న వివాదాలు, కుటుంబ కలహాలను న్యాయస్థానాల వరకు తీసుకెళ్లకుండా సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని సూచించారు. అగనంపూడి సీడబ్ల్యూసీలో మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. మధ్యవర్తిత్వ విధానం ద్వారా అనేక సమస్యలను పరిష్కరించుకోవచ్చని, తద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయని తెలిపారు. సమాజంలో వివాదాలను సామరస్యంగా పరిష్కరించడంలో మధ్యవర్తిత్వం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. దువ్వాడ శాంతిభద్రతల విభాగం ఎస్ఐ ఎం. రామచంద్రరాజు మాట్లాడుతూ, మొబైల్ యాప్‌ల ద్వారా వాహనాలు, వ్యక్తుల ఆచూకీ గుర్తించేందుకు వీలుంటుందని వివరించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే చిన్నపాటి వివాదాలను గ్రామ పెద్దల సమక్షంలో పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని, సమస్య పరిష్కారం కాని సందర్భాల్లో కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మధ్యవర్తిత్వం 3.0 కార్యక్రమం అక్టోబర్ 30వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. కేసులు ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## విజయనగరం రీడ్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక పఠనం

### పఠన సంస్కృతిపై ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ ప్రసంగం

**విజయనగరం, అక్టోబర్ 9, జయ జయహే:**

పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు సమాజంలో పఠన సంస్కృతిని విస్తరించాలనే లక్ష్యంతో విజయనగరం రీడ్స్ కమ్యూనిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పఠన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. శనివారం సాయంత్రం 5 గంటలకు విజయనగరం కోట ప్రాంతంలోని మహాకవి గురజాడ వెంకట అప్పారావు స్మారక గృహంలో ఈ కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు లజపతిరాయ్ ముఖ్య వక్తగా హాజరుకానున్నారు. “పుస్తక పఠన శక్తి -- పఠన సంస్కృతి పెంపొందించడం” అనే అంశంపై ఆయన ప్రత్యేక ప్రసంగం చేయనున్నారు. పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవడం, ఆలోచనా పరిధిని విస్తరించుకోవడం, విద్యార్థుల్లో పఠనంపై ఆసక్తిని పెంచడం వంటి అంశాలపై ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించనున్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు లజపతిరాయ్‌ను విజయనగరం రీడ్స్ కమ్యూనిటీ గౌరవాధ్యక్షులుగా అధికారికంగా ప్రకటించనున్నారు. ఆయన అనుభవం, మార్గదర్శకత్వం కమ్యూనిటీ కార్యకలాపాలకు మరింత ప్రోత్సాహాన్నిస్తాయని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పుస్తక ప్రియులు, పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజయనగరం రీడ్స్ కమ్యూనిటీ వ్యవస్థాపకులు రేపల్లె ఈశ్వరరావు కోరారు. కార్యక్రమానికి ప్రవేశం ఉచితమని ఆయన తెలిపారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

### నూతన డీఎస్పీ పావనికి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అభినందనలు

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 09, జయ జయహే**



శ్రీకాళహస్తి: పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజలకు మెరుగైన భద్రత కల్పించేందుకు పోలీసు శాఖ సమర్థవంతంగా పనిచేయాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సూచించారు. శ్రీకాళహస్తి నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన బి. పావని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆమెకు అభినందనలు తెలియజేసి, నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆకాంక్షించారు. అనంతరం పట్టణంలో శాంతిభద్రతల నిర్వహణ, నేరాల నియంత్రణ, స్థానిక సమస్యలపై డీఎస్పీతో చర్చించారు. మహిళలు, వృద్ధులు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలకు భద్రత కల్పించేలా పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల భద్రతే పోలీసు శాఖకు ప్రథమ ప్రాధాన్యత కావాలని, శాంతిభద్రతల విషయంలో రాజీ పడకుండా ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకువచ్చేలా స్నేహపూర్వక పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణాన్ని కొనసాగిస్తూ, ప్రజల్లో పోలీసు శాఖపై నమ్మకాన్ని మరింత పెంపొందించాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆకాంక్షించారు.

For a pure tomorrow.. జయహే

# అమానుషం

## అంత్యక్రియల వేళ బయటపడిన హత్య రహస్యం!

(ప్రతాప్)

ఇంట్లో అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. బంధువులు ఒక్కొక్కరుగా చేరుకుంటున్నారు. మంచం మీద నుంచి ప్రమాదవశాత్తూ పడిపోవడంతో తల్లి మరణించిందని కుమారుడు చెప్పిన మాటలను అందరూ నమ్మారు. మరికొద్దిసేపట్లో మృతదేహానికి అంతిమ సంస్కారాలు నిర్వహించాల్సి ఉంది. సరిగ్గా అదే సమయంలో ఆ ఇంటి ముందు పోలీసులు ప్రత్యక్షమయ్యారు. ఆ మరణంపై అనుమానం వ్యక్తం చేస్తూ మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించాలని నిర్ణయించారు. అంతటితో ఆ ఇంట్లో అనూహ్య పరిణామాలు మొదలయ్యాయి. చివరకు వైద్యులు వెల్లడించిన పన్నెండు గాయాల రహస్యం కన్నతల్లిని హత్య చేసిన కుమారుడి బండారాన్ని బయటపెట్టింది!




బెంగళూరులోని కన్నమంగళ ప్రాంతం బెవినమర కాలనీలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అక్కడ నివసిస్తున్న భాగ్యమ్మ సెప్టెంబర్ 24వ తేదీ రాత్రి అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించింది. ఆమె మూడో కుమారుడు బాలాజీ భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. తల్లి మంచం మీద నుంచి కిందపడటంతో ప్రాణాలు కోల్పోయిందని మరుసటి ఉదయం బంధువులకు సమాచారం అందించాడు. దీంతో కుటుంబ సభ్యులు అంత్యక్రియలకు సిద్ధమయ్యారు.




అయితే, అంతకుముందు రాత్రి భాగ్యమ్మ ఇంట్లో గొడవ జరిగినట్లు గమనించిన పొరుగింటి వ్యక్తి పోలీసులకు సమాచారం అందించాడు. కాడుగోడి పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. మరణానికి సంబంధించిన పరిస్థితులను పరిశీలించిన అనంతరం పోస్టుమార్టం తప్పనిసరని స్పష్టం చేశారు. తొలుత కుటుంబ సభ్యులు, స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబానికి అప్పగించడంతో అంత్యక్రియలు పూర్తయ్యాయి.

కొన్ని రోజుల తర-ంవాత వచ్చిన వైద్య నివేదిక దర్యాప్తును పూర్తిగా మలుపుతిప్పింది. భాగ్యమ్మ శరీరంపై ఏకంగా పన్నెండు చోట్ల తీవ్రమైన గాయాలు ఉన్నట్లు తేలింది. ముఖ్యంగా తలకు తగిలిన బలమైన గాయమే మరణానికి కారణమని వైద్యులు నిర్ధారించారు. దీంతో ప్రమాదవశాత్తూ మరణించిందన్న కథనంపై పోలీసులకు అనుమానాలు బలపడ్డాయి.

అక్టోబర్ 6న పోలీసులు స్వయంగా హత్య కేసు నమోదు చేశారు. తిరిగి కాలనీకి వెళ్లి పొరుగువారిని విడివిడిగా విచారించారు. సెప్టెంబర్ 24 రాత్రి తల్లీకుమారుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగినట్లు తెలుసుకున్నారు. దర్యాప్తులో అనుమానాలు బాలాజీ వైపు మళ్లడంతో అక్టోబర్ 7న అతడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో తల్లిపై దాడి చేసినట్లు అతడు అంగీకరించాడని పోలీసులు వెల్లడించారు.

తల్లికి చెందిన 32 గ్రాముల బంగారు ఆభరణాలను బాలాజీ తాకట్టు పెట్టినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. వాటిని విడిపించాలని ఆమె పదేపదే కోరడంతో విభేదాలు తలెత్తినట్లు నిందితుడు చెప్పాడు. కుటుంబంలోని మరికొన్ని సమస్యలు కూడా గొడవకు దారితీశాయని పోలీసులు తెలిపారు. ఆ రాత్రి ఆవేశంతో తల్లిపై పలుమార్లు దాడి చేయడంతో ఆమె ప్రాణాలు కోల్పోయినట్లు ఆరోపిస్తున్నారు.

తల్లి మరణాన్ని ప్రమాదంగా చిత్రీకరించి తప్పించుకోవాలని ప్రయత్నించిన బాలాజీ చివరకు పోలీసులకు చిక్కాడు. అంత్యక్రియలతో ముగిసిపోతుందనుకున్న వ్యవహారాన్ని పోస్టుమార్టం నివేదిక హత్య కేసుగా మలిచింది. పన్నెండు గాయాలు బయటపెట్టిన నిజం.. కన్నతల్లి మరణం వెనుక దాగిన నేరాన్ని వెలుగులోకి తెచ్చింది!

(మీడియా వార్తల ఆధారంగా)

## రోజా విమర్శలు కాదు..
## వాస్తవాలతో మాట్లాడాలి

**ప్రజా సమస్యలపై చర్చకు సిద్ధమా...**

**- వైసీపీ పాలనపై జనసేన కార్యదర్శి ఆకేపాటి సుభాషిణి**

**తిరుపతి అక్టోబర్ 9, జయ జయహే:**



మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు రోజా విమర్శలు చేయడం మానుకుని వాస్తవాలతో మాట్లాడాలని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆకేపాటి సుభాషిణి హితవు పలికారు. పవన్ కళ్యాణ్‌పై విమర్శలు చేసే ముందు వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాయలసీమ ఎత్తిపోతల పథకంపై వైసీపీ ప్రభుత్వ హయాంలో వివాదాలు తలెత్తినప్పుడు రాయలసీమ ప్రయోజనాల పరిరక్షణ కోసం ఎందుకు గట్టిగా స్పందించలేదని రోజాను ప్రశ్నించారు. పులివెందుల ప్రాంతంలో నీటి ప్రాజెక్టుల పనులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయంటూ వస్తున్న విమర్శలపై కూడా స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్దానం కిడ్నీ సమస్యపై పవన్ కళ్యాణ్ చేసిన కృషిని ఈ సందర్భంగా ఆకేపాటి సుభాషిణి ప్రస్తావించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ, వార్డు వాలంటీర్లను పార్టీ స్టార్ క్యాంపెయినర్లుగా జగన్ మోహన్ రెడ్డి పేర్కొన్న అంశాన్ని ప్రస్తావిస్తూ, వాలంటీర్లకు జీతాల పెంపుపై ఇచ్చిన హామీల అమలు గురించి ప్రజలకు వివరించాలని కోరారు. ఇతరులపై ఆరోపణలు చేయడం కంటే, తమ ప్రభుత్వ హయాంలో చోటుచేసుకున్నాయని ప్రతిపక్షాలు చేస్తున్న అవినీతి ఆరోపణలపై సమాధానం చెప్పాలని సూచించారు. ప్రజలకు అవసరమైనవి రాజకీయ విమర్శలు, మాటల యుద్ధాలు కాదని, తాగునీరు, సాగునీరు, అభివృద్ధి, ఉద్యోగ అవకాశాలని ఆకేపాటి సుభాషిణి పేర్కొన్నారు. వైసీపీ పాలనలో ప్రజలకు చేసిన మేలు ఏమిటో వివరించిన తర్వాతే పవన్ కళ్యాణ్‌పై విమర్శలు చేయాలని, ప్రజలకు సంబంధించిన అంశాలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు.

## రవాణా సేవల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కంట్రోల్ రూమ్

**- ఫిర్యాదుల స్వీకరణకు 24 గంటల సేవలు**

**మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**



అమరావతి, అక్టోబర్ 9, జయ జయహే : వాహన్, సారథి పోర్టల్ల ద్వారా రవాణా శాఖ సేవలు పొందే ప్రజలు ఎదుర్కొంటున్న సాంకేతిక సమ-స్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. వాహన యాజమాన్య బదిలీ, డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్, ఆధార్ వివరాల సరిపోలిక, హెచ్‌ఎస్ఆర్‌పీ నమోదు, సర్వర్ సమస్యల పరిష్కారానికి ఎన్ఐసీ, కేంద్ర రవాణా శాఖతో సమన్వయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల ఫిర్యాదుల కోసం రవాణా శాఖ ప్రధాన కార్యాలయంలో 24 గంటలూ పనిచేసే ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కంట్రోల్ రూమ్ నంబర్: 9281607001ఆధార్ వివరాలు సరిపోలని వారు అవసరమైన పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి లైసెన్స్ రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని, హెచ్‌ఎస్ఆర్‌పీ వివరాలు కనిపించని పాత వాహనాల యజమానులు సంబంధిత ఆర్‌టీఓ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఇంటి నుంచే లెర్నర్స్ లైసెన్స్ పరీక్ష రాసే సదుపాయం సెప్టెంబర్ 27 నుంచి అందుబాటులోకి వచ్చిందని, అక్టోబర్ 8 నాటికి 2,620 మంది ఉత్తీర్ణులయ్యారని, 138 మంది ఉత్తీర్ణులు కాలేదని మంత్రి వెల్లడించారు. రవాణా శాఖ సేవలను మరింత సులభంగా, పారదర్శకంగా అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.




## 40 మంది ప్రాణాలు కాపాడి... మృతి

**డ్రైవర్ జెట్టి శివ త్యాగం చిరస్మరణీయం**

**డ్రైవర్ మృతిపై మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సంతాపం**

**తాడేపల్లి, అక్టోబర్ 9, జయ జయహే:**

విధి నిర్వహణలో గుండెపోటుకు గురైనప్పటికీ, చివరి క్షణాల్లోనూ బస్సును సురక్షితంగా నిలిపి 40 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన ఏపీఎస్ఆర్టీసీ డ్రైవర్ జెట్టి శివ త్యాగం చిరస్మరణీయమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లాలో చోటుచేసుకున్న ఈ ఘటనపై మంత్రి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రాణాపాయ స్థితిలోనూ ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమిచ్చిన జెట్టి శివ విధి నిర్వహణ పట్ల చూపిన అంకితభావం, మానవత్వం అభినందనీయమని కొనియాడారు. తన ప్రాణాలను కోల్పోతూ 40 మంది ప్రయాణికులను కాపాడిన ఆయన సేవాస్ఫూర్తి ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని తెలిపారు. జెట్టి శివ మృతి పట్ల ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసిన మంత్రి, ఆయన కుటుంబ సభ్యులకు హృదయపూర్వక సానుభూతి తెలిపారు. కుటుంబానికి కలిగిన నష్టం పూడ్చలేనిదని పేర్కొంటూ, ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వం, ఏపీఎస్ఆర్టీసీ యాజమాన్యం బాధిత కుటుంబానికి అండగా నిలిచి నిబంధనల ప్రకారం తగిన సహాయ సహకారాలు అందించాలని ఆకాంక్షించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయినా, 40 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడిన జెట్టి శివ త్యాగం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందని మంత్రి విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

## విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలి

**ఎస్వీపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.బి. వాణిశ్రీ**

**శ్రీకాళహస్తి, అక్టోబర్ 09, జయ జయహే**

శ్రీకాళహస్తి కళాశాల విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేయకుండా, చెడు స్నేహాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఎస్వీపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.బి. వాణిశ్రీ సూచించారు. శుక్రవారం శ్రీకాళహస్తిలోని ఎస్వీపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.బి. వాణిశ్రీ మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు జూనియర్ల పట్ల స్నేహపూర్వకంగా మెలగాలని, ర్యాగింగ్‌కు దూరంగా ఉంటూ కళాశాల నియమ నిబంధనలు, విద్య ప్రాముఖ్యతపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. ఫ్రెషర్స్ డే వేడుకల నిర్వహణతో సీనియర్ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతాభావం పెంపొందుతాయని, జూనియర్లకు సీనియర్ల పట్ల అభిమానం, గౌరవం ఏర్పడతాయని తెలిపారు. విద్యార్థులు విద్యతోపాటు మంచి నడవడికను అలవర్చుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన ప్రముఖ మిమిక్రీ కళాకారుడు, వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ డి. విజయ్ కుమార్ మాట్లాడుతూ




విద్యార్థులు తమ తల్లిదండ్రుల కష్టాలను గుర్తించి, వారి ఆశయాలను నెరవేర్చేలా కష్టపడి చదవాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ తల్లిదండ్రులకు, పుట్టిన ఊరికి, దేశానికి మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని పిలుపునిచ్చారు. అనంతరం డాక్టర్ విజయ్ కుమార్ ప్రదర్శించిన మిమిక్రీ, మ్యాజిక్ ప్రదర్శనలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు ఆయనను శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. సభ అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థుల నృత్యాలు, ఇతర కళా ప్రదర్శనలు వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ గంగారాం, డాక్టర్ బాపనయ్య, డాక్టర్ కందేరి శ్రీదేవి, డాక్టర్ పి. వేణుగోపాల్, టి. నరసింహులు, డాక్టర్ వి. వాసవి, డాక్టర్ భాస్కర్, డాక్టర్ పి. గాయత్రి, డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ సాయి వెంకటేష్, డాక్టర్ కె. సుబ్బారావు, ఎస్. పద్మావతి, డాక్టర్ తులసి తదితర అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలో భాగస్వాములు కావాలి

**అనకాపల్లి జయ జయహే**

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలో భాగస్వాములు కావాలని విద్యార్థులను కోరడం జరిగింది ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అనకాపల్లి జిల్లా చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషు కుమార్ విద్యార్థులకు పిలుపునివ్వడం జరిగింది ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అనుబంధ సంస్థలైన వైఆర్సి, జేఆర్సి లో చేరి వాటి సేవలో భాగస్వాములు కావాలని స్థానిక ఏ ఎం ఏ ఎల్ కళాశాలలో ఏర్పాటుచేసిన కళాశాల యాజమాన్యం కళాశాల పూర్వపు విద్యార్థుల సంఘంతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన విద్యార్థుల అవగాహన సదస్సులో మాట్లాడుతూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అందజేస్తున్న సేవలను విద్యార్థులు అంతా అవగాహన చేసుకుని తెలుసుకోవాలని తెలుసుకోవాలని పెద్దపెద్ద విపత్తులు ప్రకృతి వైపరీత్యాలు యుద్ధాలు తీవ్రమైన అనారోగ్య తీవ్రమైన అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారు బాధితులను ఆదుకోవడానికి అవసరమైన సేవలతో రంగంలోకి దిగుతుందని డాక్టర్ గ్రంధి శేషు గారు పేర్కొన్నారు ప్రజల ఆరోగ్యం సంక్షేమం కోసం నిత్యం ఈ సొసైటీ కృషి చేస్తుందని రెడ్ క్రాస్ సొసైటీ ప్రపంచవ్యాప్తంగా ఈ సేవలో అందజేస్తున్నదని భారతదేశంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్రపతి






ఆధీనంలో పనిచేస్తుందని అలాగే రాష్ట్రంలో గవర్నర్ జిల్లా కలెక్టర్ నేతృత్వంలో సేవలు అందిస్తుందని జిల్లా వైస్ చైర్మన్ పప్పల సురేష్ పేర్కొన్నారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన కాలేజీ ప్రిన్సిపల్ బొత్స సత్యానంద సాగర్ మాట్లాడుతూ అనకాపల్లి ఏ ఎం ఏ ఎల్ కళాశాలలో త్వరలోనే వై ఆర్ సి జేఆర్సి యూనిట్లను ప్రారంభించనున్నామని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థలను అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని వారు పేర్కొన్నారు కోశాధికారి పెనుమత్స కృష్ణంరాజు మాట్లాడుతూ కళాశాల నిర్వహిస్తున్న అన్ని మంచి కార్యక్రమాలకు పూర్వ విద్యార్థుల సంఘం సహకరిస్తున్నదని సొసైటీలో పని చేసే వారికి మంచి పేరు గుర్తింపు వస్తుందని సంఘంలో మర్యాదలు పెరుగుతాయి అని ఇది అంతర్జాతీయ సంస్థ అని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో బొడ్డేడ అప్పారావు ఏవో డాక్టర్ గిల్లా జయ బాబు పెంటకోట అనురాధ పిడి డాక్టర్ కే ఏ ఎస్ నాయుడు డాక్టర్ మహేశ్వర రావు జిల్లా విశ్రాంత విద్యాశాఖ అధికారి కె గౌరీపతి బొగ్గరపు సర్వా రావు సానా త్రినాథ్ డి ఎఫ్ ఓ మిల్టన్ పూర్వపు విద్యార్థులు కళాశాల విద్యార్థులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com